

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## స్టేట్ విజన్

STATE VISION

బుధవారం 29-07-2026 పేజీలు : 16


'విజన్ ఆంధ్ర' ఎఫెక్ట్



## చర్ల బస్టాండ్‌కు కొత్త కళ

ప్రయాణికుల చిరునవ్వుల మధ్య తాత్కాలిక ఉపశమనం

2 పేజీలో..

## ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం



15 పేజీలో...

అక్కన్నపేట, జూలై 28 (విజన్ ఆంధ్ర) : ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### నల్లమల గిరిజనులు, ఆదివాసీలు ,ఎస్సీ ఎస్టీల అభ్యున్నతే

# ప్రజా ప్రభుత్వం లక్ష్యం

- ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్
- అచ్చంపేట నియోజకవర్గంలో రూ.12.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన,
- చెంచు గిరిజనుల స్వయం ఉపాధికి రూ.1.80 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం



అచ్చంపేట జులై 28 ( విజన్ ఆంధ్ర) : నల్లమల్ల గిరిజనులు ఆదివాసులు ఎస్సీ ఎస్టీ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు

, మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు గురుకులాల ఆకస్మిక తనిఖీ చేసిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి విద్యార్థులు, సిబ్బందితో ముఖాముఖి విద్య, వసతి, మౌలిక వసతులపై సమగ్ర సమీక్ష దివంగత దళిత ఉద్యమ నాయకుడు పుట్టపాక మహేంద్రనాథ్ కలలు కన్న సమసమాజ నిర్మాణం, దళిత,గిరిజన సాధికారత, నాణ్యమైన విద్య, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుబడి ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన నల్లమల గిరిజన ప్రాంతాల అభివృద్ధిని ప్రత్యేక లక్ష్యంగా తీసుకుని పనిచేస్తోందని, గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం, వారి పిల్లలకు అత్యున్నత స్థాయి విద్యను అందించడం, ఉ పాధి అవకాశాలను విస్తరించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా భావిస్తోందని మంత్రి అన్నారు.

13 పేజీలో...

## ప్రాథమిక విద్య బలోపేతమే విద్యాభివృద్ధికి పునాది

- 1, 2వ తరగతుల విద్యార్థులకు చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్పాలి
-కె.హైమావతి, జిల్లా కలెక్టర్
- పాలమాకుల జెడ్పీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీలి
- మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆగ్రహంలి

నంగునూరు,జూలై 28 విజన్ ఆంధ్ర : ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు పటిష్టంగా అందిస్తే విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు.

16 పేజీలో...



# కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్ ధర్మపురి



12 పేజీలో...

### నిజామాబాద్ పార్లమెంట్ పరిధి రైల్వే ప్రాజెక్టులపై వినతి

నిజామాబాద్ జులై28:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ అర్వింద్ ధర్మపురి ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వేలకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఈ సందర్భంగా నవీపేట రైల్వే క్రాసింగ్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (=ాదీ) మంజూరు చేయాలని, అలాగే డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి (=ాదీ) నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్ర మంత్రిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే స్థానిక

## నర్సాపూర్‌లో 29, 30 తేదీల్లో అంగన్‌వాడీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

శివ్వంపేట, జూలై 28(విజన్ ఆంధ్ర): నర్సాపూర్ ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన (వెరిఫికేషన్) ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.
అధికారుల వివరాల ప్రకారం, జూలై 29న నర్సాపూర్, శివంపేట్ మండలాల అభ్యర్థులు, జూలై 30న తూప్రాన్, మనోహరాబాద్, కౌడిపల్లి మండలాల అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది.
అభ్యర్థులు ఉదయం 10 గంటలలోపు నర్సాపూర్ ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకుని, తమ అసలు విద్యార్హత ధ్రువపత్రాలు, అవసరమైన ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు, వాటి జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని అధికారులు సూచించారు. నిర్ణీత తేదీ, సమయానికి హాజరై వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ముదిరాజ్ భవనం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలిసిన నందిగామ ముదిరాజ్‌లు
- స్పందించిన ఎమ్మెల్యే రెండు,మూడు నెలల్లో భవన నిర్మాణానికి ఏర్పాటు



నందిగామ:జులై 28(విజన్ ఆంధ్ర న్యూస్); నందిగామ మండల కేంద్రంలో ముదిరాజ్ భవనం ఏర్పాటు చేయాలని,మంగళవారం నందిగామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గడ్డమీది యాదయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు వినతిపత్రం అందజేశారు.ప్రతిస్పందించిన ఎమ్మెల్యే నందిగామలో ముదిరాజ్ భవనం నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేసుకుంటే రెండు లేదా మూడు నెలల్లో భవన నిర్మాణానికి శ్రీకారం చూడదామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.అనంతరం అమరవీరుల స్థూపం వద్ద త్యాగధనుల సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ,ఏఎంసీ డైరెక్టర్ చాకలి నర్సింలు,నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లి కుమారస్వామి గౌడ్, నందిగామ ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు పిట్టల రాములు,ముదిరాజ్ సంఘం నాయకులు గడ్డమీది బాల్ రాజ్,గడ్డమీది లక్ష్మయ్య,గడ్డమీది మల్లేష్,ఈట పాండు,పల్లెమోని రాములు, మొద్దు నర్సింహ,గడ్డమీది రమేష్,నందిగామ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచంద్రి,తదితరులు ఉన్నారు.

## చర్ల బస్టాండ్‌కు కొత్త కళ

'విజన్ ఆంధ్ర' ఎఫెక్ట్

ప్రయాణికుల చిరునవ్వుల మధ్య తాత్కాలిక ఉపశమనం



చర్ల,(భద్రాద్రికొత్తగూడెం జిల్లా): చాలా కాలంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న చర్ల బస్టాండ్ ప్రాంగణంలోని గుంతలకు ఎట్టకేలకు తాత్కాలిక మోక్షం లభించింది, ఆదివారం విజన్ ఆంధ్ర ప్రచురించిన కథనంతో ఆర్టీసీ అధికారులు ఒక అడుగు ముందుకు వేశారు, చర్ల బస్టాండ్ కంట్రోలర్ గా పని చేస్తున్నా సదానందం చూపిన ప్రత్యేక చొరవతో అధికారులు స్పందించి మట్టితో గుంతలను పూడ్చివేయడం పట్ల స్థానిక ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ స్పందనగా చేపట్టిన ఈ తాత్కాలిక చర్య ఎంతో ఊరటనిచ్చింది, అయితే వర్షాకాలంలో ఈ సమస్య పునరావృతం కాకుండా ఉండేందుకు ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన పనులు జరగాలని ప్రజలు బలంగా కోరుతున్నారు ఈ ప్రాంతంలో పూర్తిస్థాయిలో ఫ్లోరింగ్ పనులు చేపట్టి, బస్టాండ్‌ను మరింత అభివృద్ధి చేసే దిశగా ఆర్టీసీ ఉన్నతాధికారులు త్వరలోనే సముచిత చర్యలు తీసుకుంటారని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు, ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఇలాంటి మంచి ప్రయత్నాలు మరింత ముందుకు వెళ్లాలని మండల ప్రజలు కోరుతున్నారు



## రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత




అక్కన్నపేట, జూలై 28 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత కొనసాగడం ఆందోళన కలిగించే విషయమని రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి అన్నారు.
కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని మొత్తం పాఠశాలల్లో సుమారు ఐదు శాతం బడుల్లో బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు లేవని తెలిపారు. దాదాపు 1,300కు పైగా పాఠశాలల్లో ఈ సౌకర్యం లేకపోవడం వల్ల బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత బాలికల విద్యపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. ప్రాథమిక స్థాయిలో డ్రాపౌట్ రేటు దాదాపు శూన్యంగా ఉన్నప్పటికీ, సెకండరీ విద్యకు చేరుకునే సరికి అది క్రమంగా పెరుగుతోందని తెలిపారు. దీంతో పలువురు బాలికలు 8వ తరగతి తర్వాత చదువును మధ్యలోనే నిలిపివేస్తున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు.
2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన గణాంకాల ప్రకారం సెకండరీ విద్యలో బాలికల డ్రాపౌట్ రేటు జాతీయ సగటు 8 శాతం కాగా, తెలంగాణలో 4.3 శాతంగా నమోదైందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించిందని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణాన్ని అత్యవసరంగా పూర్తి చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## నందిగామ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ డా.తరుణ్ జోషి

**- పోలీసు సేవల మెరుగుదలపై కీలక ఆదేశాలు.**

**- కాన్హా శాంతివనం సందర్శన,నిర్వాహకులతో సంస్థ కార్యకలాపాల గురించి తెలుసుకున్న కమిషనర్**

నందిగామ:జులై 28(విజన్ ఆంధ్ర న్యూస్); ఫ్యూచర్ సిటీ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ సోమవారం సాయంత్రం నందిగామ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు పోలీస్ స్టేషన్ పనితీరు,రికార్డుల నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణను క్రమబద్ధంగా నిర్వహించాలని,పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని,సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.
గ్రేవ్ అన్‌డిటెక్టెడ్ (యు ఐ) కేసులను సాంకేతిక ఆధారాలతో త్వరగా ఛేదించేందుకు చర్యలు తీసుకోవాలని,విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని,రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనల అమలు,అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.సిసిటిఎన్ఎస్, ఈ-సాక్ష్య సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని,ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలకు తక్షణ స్పందన ఇవ్వాలని సూచించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని ఆదేశించారు.
అనంతరం పోలీస్ కమిషనర్ కాన్హా శాంతివనం ను



సందర్శించారు.అక్కడి నిర్వాహకులతో సంస్థ కార్యకలాపాల గురించి తెలుసుకుని, చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ కొంత సమయం గడిపారు.చిన్నారులను ప్రోత్సహిస్తూ వారి విద్య,విలువలు మరియు మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని ప్రేరేపించారు.
ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ జోన్ డీసీపి శిరీష, షాద్‌నగర్ ఏసీపీ ఎస్.లక్ష్మీనారాయణ, నందిగామ ఎస్‌హెచ్‌ఓ వీరబాబుతో పాటు పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానచలనం

అక్కన్నపేట, జూలై 28 (విజన్ ఆంధ్ర) హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానచలనం జరిగిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు బాల్‌రాజు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంగనాథ్ ఒక సమర్థవంతమైన, నిష్పక్షపాత పోలీసు అధికారిగా ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైడ్రా వ్యవస్థను ప్రవేశపెట్టినప్పుడు ఆయన సామర్థ్యాన్ని గుర్తించి కీలక బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా హైదరాబాద్ నగరంలో రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు, 2,435 ఎకరాల భూమిని పరిరక్షించడంలో రంగనాథ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. నగర ప్రజలు చెరువులు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో కుటుంబాలతో ప్రశాంతంగా గడిపే పరిస్థితి ఏర్పడటంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. సమర్థవంతమైన, క్రమశిక్షణ కలిగిన అధికారులకు బదిలీలు, స్థానచలనాలు సహజమేనని బాల్‌రాజు అన్నారు. అలాంటి అధికారులు ఎక్కడ పనిచేసినా తమ పనితీరుతో ప్రజల మన్ననలు పొందుతారని, ప్రభుత్వం వారికి అప్పగించే బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.

## మాజీ కేంద్ర మంత్రి, అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత జైపాల్ రెడ్డి ఏడో వర్ధంతి

అక్కన్నపేట, జూలై 28: మాజీ కేంద్ర మంత్రి, అత్యుత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత జైపాల్ రెడ్డి ఏడో వర్ధంతి సందర్భంగా స్ఫూర్తి స్థల్‌లో ఆయన స్మారకానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో విశిష్ట నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో పదునైన ప్రసంగాలు చేసి అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. 15వ లోక్‌సభకు తాను కొత్తగా ఎన్నికై పార్లమెంట్‌లో అడుగుపెట్టిన సమయంలో జైపాల్ రెడ్డి తమకు ఎంతో స్ఫూర్తినిచ్చారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు ఆమోదం లభించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో సిద్ధాంతాలు, నైతిక విలువలు, మచ్చలేని ప్రజాసేవా నిబద్ధతతో జైపాల్ రెడ్డి పనిచేశారని, ఆయన రాజకీయ ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## మర్కుక్ రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమం

**-- మండల రైతులకు విత్తనాల పంపిణీ**

**-మర్కుక్ మండల వ్యవసాయ అధికారి రాము**

మార్కుక్ జూలై 28,(విజన్ ఆంధ్ర ): మర్కుక్ మండల రైతు వేదికలో మంగళవారం నాడు విత్తన మేళాను మండల ప్రత్యేక అధికారి సంధ్య పరిశీలించి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో (జుశ్రీ చీఱశీ) పరిస్థితుల దృష్ట్యా రైతులు అధిక నీటి అవసరమున్న వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసి నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకొని వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విక్రమ్,మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి రాము,మర్కుక్ సర్పంచ్ రాణి మల్లేష్,గంగాపూర్ యూసఫ్‌ఖాన్‌పల్లి సర్పంచ్ శ్యామల ప్రవీణ్,వ్యవసాయ విస్తరణ అధికారులు విష్ణు,భాను శ్రీ రైతులు పాల్గొన్నారు.



# రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలి

**- రైతు నేస్తం కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

**- ఆరుతడి పంటల సాగుపై వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు మంత్రి, ఎమ్మెల్యే సూచనలు**

**- రైతు నేస్తం 100 వ ఎపిసోడ్ కార్యక్రమం**



తాండూరు, జూలై 28 (విజన్ ఆంధ్ర) రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతు నేస్తం కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. తాండూరు మండలం అంతారం రైతువేదికలో "రైతు నేస్తం 100వ ఎపిసోడ్" కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారితో రైతులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి గారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాండూరు నియోజకవర్గంలోని వ్యవసాయ పరిస్థితులు, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, రైతుల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తక్కువ నీటితో అధిక దిగుబడు అందించే పంటలను సాగు చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతులకు మంత్రి, ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆదర్శ రైతులకు ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీ వెంకటయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి , డీఏవో కవిత , ఏడిఏ అరుణ , కొమరయ్య ,మండల పార్టీ అధ్యక్షుడు రాజ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ఏఈఓ సుమ , పలువురు సర్పంచ్ లు, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను అందించి ఆదుకోవాలి



అక్కన్నపేట, జూలై 28 (విజన్ ఆంధ్ర) : రైతులకు సకాలంలో నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను అందించి ఆదుకోవాలని, రైతులకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా తెలియజేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక ముందు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామంచ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, వానాకాలం సాగు సీజన్‌లో రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను తగినంతగా అందుబాటులో ఉంచడంలో విఫలమైందని విమర్శించారు. విత్తనాల కొరత కారణంగా రైతులు ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని, దీంతో సాగు వ్యయం పెరిగి రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను సకాలంలో అందించి వారి ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.

రైతులకు సంబంధించిన ప్రభుత్వ సమాచారం, సబ్సిడీ విత్తనాల పంపిణీ వివరాలు, వ్యవసాయ పథకాల సమాచారాన్ని కేవలం వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపించడం వల్ల అవి అందరు రైతులకు చేరడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు లేని రైతులు, వాట్సాప్ వినియోగించని రైతులు అధిక సంఖ్యలో ఉన్నందున ప్రభుత్వం ప్రతి గ్రామంలో డప్పు చాటింపు ద్వారా సమాచారాన్ని అందించే విధానం అమలు చేయాలని కోరారు. దీంతో ప్రతి రైతుకు సమాచారం సకాలంలో చేరి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతాయని తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్న రామంచ మహేందర్ రెడ్డి, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతుల తరఫున ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు జయదేశ్వరా చారి, కుంట స్వప్న, గంగుల కుమార్, సలేంద్ర తిరుపతి, గిరిమల్ల రాజు, దార్న రాజు, కొండ్ర సంజీవరెడ్డి, బొంకూర్ రజనీకాంత్, కట్కూర్ ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వేముగంటి తేజ, వద్దూరి సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జిగా కొట్టాల యాదగిరి

గజ్వేల్, 28 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తెలంగాణ రక్షణ సేన ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన కొట్టాల యాదగిరి మంగళవారం మొదటిసారిగా గజ్వేల్‌కు విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఆయనకు శాలువాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి కొట్టాల యాదగిరి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాపై నమ్మకంతో గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కి ప్రత్యేక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. త్వరలోనే



నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కమిటీలు వేసి, పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను పండగలా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు ఎడ్ల నర్సింలు మాజీ ఎంపీటీసీ, నవీన్, అశోక్, రాజు, చందు, సురేష్, ప్రసాద్, నర్సింలు, నరేష్, హరి, తదితరులు పాల్గొన్నారు.

# శివంపేటలో ఓటర్ల నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలు

**- ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావాలి: డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ బషీర్ హుస్సేన్**



మెదక్ , శివ్వంపేట, జూలై 28 (విజన్ ఆంధ్ర): శివంపేట మండల పరిధిలో ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ బషీర్ హుస్సేన్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. వచ్చే నెల 3వ తేదీతో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో, ఇంకా నమోదు చేసుకోని అర్హులైన యువత, మహిళలు వెంటనే తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని కోరారు.
ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ బషీర్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

# సమాజ సేవకు గౌరవ డాక్టరేట్ తాండూర్‌కు చెందిన కేశెట్టి సంతోష్‌కుమార్‌కు అంతర్జాతీయ గుర్తింపు



బెల్లంపల్లి జూలై 28 విజన్ ఆంధ్ర : తాండూర్ మండలానికి చెందిన అభినవ కల్చరల్ సోషల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషనల్ అండ్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశెట్టి సంతోష్‌కుమార్‌కు అమెరికాలోని యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. సమాజ సేవలో మూడు దశాబ్దాలుగా అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి 'డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్' (హానరరీ డాక్టరేట్) పురస్కారానికి ఎంపిక చేసి యూనివర్సిటీ లేఖ పంపినట్లు తెలిపారు.
యూనివర్సిటీ అధికారిక నామినేషన్ సభ్యురాలు డాక్టర్ అభినయ వాసవి ద్వారా జూలై 17న గౌరవ డాక్టరేట్ ప్రదానానికి సంబంధించిన ప్రతిపాదన లేఖ అందింది అని
ఈ ఏడాది ఆగస్టు 29న పుదుచ్చేరిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు వారు వెల్లడించారు.
రక్తదాన శిబిరాల నిర్వహణ, పేదలకు సహాయ కార్యక్రమాలు, విద్యార్థులకు ప్రోత్సాహం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, యువతలో సేవా స్ఫూర్తి పెంపొందించడం, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో గత 30 ఏళ్లుగా చేసిన సేవలను గుర్తించి ఈ గౌరవానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

# మున్సిపాలిటీ అధికారులు జర కోతులను పట్టించండి సార్లు

భూపాలపల్లి జిల్లా జూలై 28 (విజన్ ఆంధ్ర )భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల జంగేడు 14 వ వార్డులో కోతుల బెడద తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లలోకి చొరబడి ఇంట్లో ఏది దొరుకుతే అది ఎత్తుకొపోవడమే కాకుండా బీభత్సమ్ సృష్టిస్తున్నాయి. రహదారి పై వెళ్తున్న వారిపై ఎగబడుతూ ఇబ్బందులకు గురి చేస్తూ భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మంజీరా కలుషితమవుతోందా..? కాలుష్య నియంత్రణ మండలి చర్యలు ఎక్కడ..?



**గ్రామస్తుల ఆరోపణలు**

**- కార్మికుల ఖండనలు.. నివేదిక కోసం**

**-శివంపేటలో మంజీరా కాలు[ష్యంపై]**

**భిన్నాభిప్రాయాలు..**

**- అధికారుల నివేదిక కోసం ఎదురుచూపులు**



చౌటకూర్, జూలై 28 విజన్ ఆంధ్ర : సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట సమీపంలోని చార్మినార్ బ్రూవరీస్ పరిశ్రమపై మంజీరా నదిలో కాలుష్య జలాలు విడుదల చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలను పైపుల ద్వారా మంజీరా నదిలోకి వదులుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తూ జిల్లా ఉన్నతాధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు.
ఫిర్యాదు అందుకున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశ్రమను పరిశీలించి, నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించినట్లు సమాచారం. అలాగే గ్రామస్తుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని పరిశ్రమ యాజమాన్యాన్ని కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రయోగశాల నివేదిక కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.
అయితే, పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు గ్రామస్తుల ఆరోపణలను పూర్తిగా ఖండించారు. పరిశ్రమలో అత్యాధునిక ఈటీపీ (వ్యర్థ జల శుద్ధి కేంద్రం) ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీటినే నిబంధనల మేరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బయటకు వెళ్లింది కేవలం వర్షపు నీరేనని, పరిశ్రమ వ్యర్థ జలాలను మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారనే ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు.కాలుష్య ఆరోపణల ప్రభావంతో పరిశ్రమ ఉత్పత్తి తగ్గిందని, తమ ఉపాధి ప్రమాదంలో పడుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ మూతపడితే వందలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని పేర్మెంటూ గ్రామ పంచాయతీకి వినతిపత్రం సమర్పించారు.మరోవైపు, మంజీరా నది ప్రజలకు తాగునీటి ప్రధాన వనరని, దానిని కలుషితం చేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రయోగశాల నివేదికను త్వరగా విడుదల చేసి, అందులో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారంపై గ్రామస్తులు, కార్మికుల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. ఆరోపణలు నిజమా? లేక అపోహలా? అన్నది కాలుష్య నియంత్రణ మండలి ప్రయోగశాల నివేదిక వెలువడిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి




**- సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విఠల్**

**సంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్**

పెద్ద శంకరంపేట్, జూలై 28: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్.. తెలంగాణ ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విట్టల్. బీజేవైఎం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్ లు పేర్కొన్నారు.. మంగళవారం పెద్ద శంకరంపేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బిజె వైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఫీజుల బకాయి బిజెపి లడాయి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందన్నారు. విద్యార్థులకు బకాయి ఉన్న 15వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు అత్యవసర ఆర్థిక ఉపశమనం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ బి జె వై ఎం కన్వీనర్ సాయి పటేల్ కో కన్వీనర్ బుగుడాల కృష్ణ.. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. నాయకులు ప్రభు గౌడ్ ప్రవీణ్ సాయిరాం ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# ఆర్మూర్ - తెలంగాణలో జనసేన జెండా ఎగరడం ఖాయం మీసాల శ్రీనివాస్

ఆర్మూర్ నిజా మాబాద్ జిల్లా జూలై 28( విజన్ ఆంధ్ర) ఆర్మూర్ పట్టణ మెడికల్ డ్రగ్స్. అండ్ .కెమిస్ట్ అసోసియేషన్ బిల్డింగ్ హాల్లో జనసేన పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఆత్మీయ సమావేశ సమ్మేళ న కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర జనసేన నాయకుడు తో పాటు జిల్లా అధ్యక్షుడు నియోజకవర్గ కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ రోజు సందర్భంగా మీసాల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంబాద్ జహీరాబాద్ జిల్లాలో ఆగస్టు 8వ తారీకు నాడు అసెంబ్లీల నియోజకవర్గాల సమావేశం నిర్వహించబడుతుందని ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు సిద్ధాంతాలకు యువతలే కాకుండా ఎంతో వయస్సు ఉన్న వారు కూడా జనసేన పార్టీ వైపు ఈరోజు చూస్తున్నారు పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో డబ్బులు సంపా దించే వ్యక్తి కాదు డబ్బులు సంపాదించుకొని రాజకీయాల్లో వచ్చాడు ఇప్పుడు కూడా డే టైం లో డిప్యూటీ సీఎం గా చేస్తూ నైట్ టైం లో సినిమాలు చేస్తూ అంత కష్టపడుతున్న వ్యక్తి అంటే పవన్ కళ్యాణ్ ప్రజలు తెలంగాణ రాష్ట్రంలో ఇతర పార్టీలు ఏకంగా అది గమనిస్తున్నారు రానున్న కాలంలో జనసేన పార్టీని తెలంగాణ రాష్ట్రంలో జెండాను ఎగరవేయడం ఖాయమంటూ మాట్లాడారు ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు ప్రవీణ్ రాము కళ్యాణ్ గౌడ్ హరి వర్ధన్ అవినాష్ బండి రాము కొండ సంతోష్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌లో ఉండాల్సిన బ్యాలెట్ బాక్స్ పాత ఇనుప సామాను షాప్‌లో ప్రత్యక్షం






భూపాలపల్లి జిల్లా జులై 28 (విజన్ ఆంధ్ర ) స్ట్రాంగ్ రూమ్‌లో ఉండాల్సిన బ్యాలెట్ బాక్స్ పాత ఇనుప సామాను షాప్‌లో ప్రత్యక్షం.నల్లగొండలో పాత ఇనుప సామాను దుకాణంలో ఎన్నికల బ్యాలెట్ బాక్స్ కలకలం.నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలోని స్క్రాప్ షాప్‌లో బ్యాలెట్ బాక్స్ గుర్తింపు.
ఎన్నికలు ముగిశాక స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాల్సిన బ్యాలెట్ బాక్స్ బయటకు రావడంపై చర్చ . బాక్స్‌పై ఉన్న వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందినదిగా గుర్తింపు.స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు ఎలా వచ్చింది..? అధికారికంగా వేలం వేశారా..? అనే ప్రశ్నలు మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఈ బాక్స్‌ను విక్రయించాడని షాప్ యజమాని వెల్లడి.

విచారిస్తున్న పోలీస్ లు అసలు భూపాలపల్లి జిల్లా కు సంబందించిన బ్యాలెట్ బాక్స్ నల్గొండ లో ఎలా ప్రత్యక్ష మవుతుంది ఆరాధిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలు ఖమ్మం, నల్గొండ, వరంగల్ నియోజకవర్గం ఎమ్మెల్సి ఎన్నికలు జరుగుతుంది. అయితే ఆ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం లో ఆ బాక్స్ ను అక్కడే వదిలేశారా అనే కోణం లో పోలీస్ లు ఇంక్వయిరీ చేస్తున్నారు. ఈ విషయం పై ఎన్నికల నాయబ్ తహసీల్దార్ అబ్బాస్ విజన్ ఆంధ్ర వివరణ కోరగా నేను 2022 నుండి నేను భూపాలపల్లి జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాను. నల్గొండ పాత ఇనుప సామాను షాపు లో ప్రత్యక్ష మైన బ్యాలెట్ బాక్స్ నేను ఇక్కడికి రానప్పటి బాక్స్ కావచ్చు ఎందుకంటే గ్రాడ్యుయేట్ ఎన్నికల సమయంలో బాక్స్ లకు ౧+ /29/00029 అని వ్రాసి ఉంటుంది మా దగ్గర గ్రాడ్యుయేట్ కు సంబందించి పదనాలుగు బాక్స్ లు ఏడు పోలింగ్ స్టేషన్ లు ఉంటాయి ఒక పోలింగ్ స్టేషన్ కు రెండు చొప్పున మొత్తం పదనాలుగు బాక్స్ లు మా దగ్గర ఉన్నాయి.



# నూతన సీఐ కట్టా నరేందర్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, జులై 28 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో నూతనంగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన కట్టా నరేందర్ రెడ్డిని హరితసేన నియోజకవర్గ ఇన్ చార్జి పూలపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి రవికుమార్, ఈర్లపల్లి మాజీ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ యువ నాయకుడు కొల్లగల్ల భాస్కర్, ఊరెళ్ళ బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ ఆసిఫ్ తదితరులు శాలువాలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సమర్థవంతమైన పోలీసు సేవలు అందిస్తామని పేర్కొన్నారు. సీఐ ని కలిసిన వారిలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రోడ్డు కాదు.. బురద కూపం !

## దామస్తాపూర్--షాపూర్ రహదారిపై నరకయాతన

## మధ్యలోనే నిలిచిన పనులు.. వాహనదారుల అవస్థలు

## ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందిస్తారా? అంటూ స్థానికుల ఆగ్రహం



మర్పల్లి , జులై 28 (విజన్ ఆంధ్ర): వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని దామస్తాపూర్ నుంచి షాపూర్ వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా బురదమయంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో వర్షాలకు రహదారి అంతా బురదతో నిండిపోయి ప్రయాణం ప్రమాదకరంగా మారింది.ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురదలో వాహనాలు జారిపడే పరిస్థితి నెలకొనడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయంతోనే ప్రయాణాలు కొనసాగిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, ఉద్యోగాలు, వ్యవసాయ పనుల నిమిత్తం ఈ రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రోడ్డు పనులు ప్రారంభించిన తర్వాత వాటిని పూర్తిచేయకుండా మధ్యలోనే నిలిపివేయడంతో ప్రజలకు మరింత కష్టాలు తప్పడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా రహదారి మొత్తం బురద కూపంగా మారి వాహనాల రాకపోకలు సైతం ప్రమాదకరంగా మారాయని చెబుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దామస్తాపూర్--షాపూర్--కల్కోడ్ రహదారి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదాలు జరిగే వరకు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ పోగ్రామ్‌కి హాజరయిన హుస్నాబాద్ కౌన్సిలర్లు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 28 హైదరాబాద్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ అర్బన్ మానేజ్మెంట్ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ అఫ్ ఇండియా గచ్చిబౌలిలో తెలంగాణ లోని వార్డ్ కౌన్సిలర్స్ లకు,కో ఆప్షన్స్ సభ్యులకు కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ చెందిన స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఈ ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026,జల్ సంచయ్ జన భాగిదరి, ఇంజనీరింగ్ విభాగం, మున్సిపల్ చట్టం 2019, అమృత్ సబ్ స్కీమ్స్,క్యాచ్ ది రెయిన్ మొదలగు వాటిపై అవగాహన కల్పించారు.ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్స్ బూరుగులత, పిల్లి తిరుపతి,సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్,బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, శోభన్ బాబు, కో ఆప్షన్ మెంబర్ లు హసన్,భూక్యా సరోజన పాల్గొనారు.

# పౌనూరు -లొద్దిగూడ రోడ్డు సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## -- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు



గాదిగూడ,జులై 28(విజన్ ఆంధ్ర) : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని దాబా (బి) గ్రామ పంచాయతీ పరిధిలోని పౌనూరు,లొద్దిగూడ పీవీటీజీ గ్రామాలల్లో మంగళవారం టిఏజిఎస్ నాయకులు సందర్శించారు.ఆ గ్రామాల్లో ఉన్నా రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించి,అంగన్వాడీ భవనం నిర్మాణం చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఏజీఎస్)నాయకులు డిమాండ్ చేశారు.టిఏజిఎస్ గాదిగూడ మండల కార్యదర్శి కుంరా భీంరావ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఆదివాసీ గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం ప్రభుత్వాలకు సిగ్గుచేటు అని అన్నారు.భారతదేశపు మూలవాసులైన ఆదివాసులు ఇప్పటికీ మౌలిక సదుపాయాలకు ఆమడ దూరంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు.పౌనూరు, లొద్దిగూడ గ్రామాలలో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,అలాగే చిన్నా పిల్లల కోసం అంగన్వాడీ భవనం కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణంతో పాటు అంగన్వాడీ భవనాన్ని తక్షణమే మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గాదిగూడ మండల ఉపాధ్యక్షుడు కుర్సెంగా సురేష్, మండల నాయకుడు పెంధోర్ శంకర్,గ్రామ పటేల్ నైతం సోనేరావ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

బోథ్. జూలై 28. (విజన్ ఆంధ్ర) పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ ఓరుగంటి స్వామి, వీడీసీ అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి లు అన్నారు.
వీబీజీ రామ్ (జీ) కార్యక్రమంలో భాగంగా మంగళవారం బోథ్ మండలంలోని కౌట – బి గ్రామంలోని స్మశానవాటికలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే మానవ మనుగడకు ఆస్కారం ఉందని అన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, రోడ్లకు ఇరువైపుల మొక్కలను నాటి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. మొక్కలను నాటే కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి. అంజయ్య, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రామ్ సింగ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వరి సాగు వద్దు..

**ఆరుతడి పంటల వైపు మళ్లండి**

**కె. హైమావతి జిల్లా కలెక్టర్ సిద్దిపేట**

**- రైతు నేస్తం' 100వ ఎపిసోడ్‌లో రైతులకు కీలక సూచనలు**

**- నీటి సంరక్షణ, పంట మార్పిడిపై అవగాహన**

నంగునూరు మండలం జూలై 28 విజన్ ఆంధ్ర ఎల్‌నినో ప్రభావం కారణంగా ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండి నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతాంగానికి పిలుపునిచ్చారు.

మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన రైతు నేస్తం 100వ ఎపిసోడ్ ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంట మార్పిడి, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, ఆయిల్ పామ్ సాగుపై



రైతులకు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండలం నర్మేట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్--జూలై నెలల్లో ఆశించిన మేర వర్షాలు కురవలేదని, ఆగస్టు చివరి నుంచి సెప్టెంబర్‌లో వర్షపాతం మరింత తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరించినట్లు తెలిపారు. జిల్లాలో సంప్రదాయంగా సాగు చేస్తున్న వరి విస్తీర్ణాన్ని తగ్గించి, కందులు, పప్పుధాన్యాలు, రాగులు, సజ్జలు, కొర్రలు, ఇతర మిల్లెట్ పంటలు, ఆముదం వంటి నీటి అవసరం తక్కువగా ఉండే పంటలను సాగు చేయాలని సూచించారు.

ఒక ఎకరం వరికి అవసరమయ్యే నీటితో ఐదు ఎకరాల ఆరుతడి పంటలను సాగు చేయవచ్చని పేర్కొన్న కలెక్టర్, భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతున్న నేపథ్యంలో వరి పంట ఆగస్టు చివరి, సెప్టెంబర్ నెలల్లో ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నర్మేటలోనే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఉన్నందున రైతులు పెద్దఎత్తున ఆయిల్ పామ్ సాగు చేపట్టి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని, ఆయిల్ పామ్‌లో అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, రూఫ్ వాటర్ రీచార్జ్ నిర్మాణాలు, బోర్‌వెల్ రీచార్జ్ వ్యవస్థలను గ్రామాల్లో ఏర్పాటు చేసి ప్రతి నీటి చుక్కను భద్రపరచాలని రైతులకు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, నంగునూరు ఏఎంసీ చైర్మన్ యాదగిరి, నర్మేట సర్పంచ్ స్వాతి, పిఏసియస్ చైర్మన్లు కోలా రమేష్ మహిపాల్ రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలతో రైతులు ఆర్థిక లాభాలు పొందాలి

**-- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



బెల్లంపల్లి జూలై 28 విజన్ ఆంధ్ర : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు కష్టతరంగా మారిన నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆర్థికంగా లాభపడాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు.

## ప్రవీణ్ కుమార్‌కు కౌన్సిలర్ దయాకర్ చేయూత

**- రూ.11 వేల ఆర్థిక సాయం అందజేత.. మరింత మంది దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి**



చేవెళ్ల, జూలై 28 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల మున్సిపల్ పరిధి దామరగిద్ద వార్డుకు చెందిన జేజే ప్రవీణ్ కుమార్ మెదడు సంబంధిత తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న చేవెళ్ల మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ పెద్దోళ్ల దయాకర్ మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన అనంతరం వైద్య చికిత్స నిమిత్తం రూ. 11 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ... ప్రవీణ్ కుమార్ త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున పెద్ద మనసున్న దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. ప్రవీణ్ కుమార్ తల్లి సహాయం అందించిన కౌన్సిలర్ దయాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, చికిత్స కోసం ఇంకా ఆర్థిక సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పోతారం(ఎస్), దేవేంద్రనగర్ గ్రామాలలో అదనపు బూత్‌లు ఏర్పాటు చేయాలి

**- తోట స్వరూప**

**- మహిళా మోర్చా రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూలై 28 : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పోతారం (ఎస్) గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ ఆధ్వర్యంలో పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు, మండల సంయోజక్ తోట స్వరూప ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సంస్థాగత బలోపేతంపై సమగ్ర దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త చురుగ్గా పాల్గొని పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ మండలంలోని పలు గ్రామాల బూత్ కమిటీలను సమీక్షించి, బాధ్యతలను ఖరారు చేశారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల పదాధికారులను ఘనంగా సన్మానించి, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం హుస్నాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. పోతారం (ఎస్) గ్రామంలో ఒకే బీఎల్ఓ పరిధిలో 1,200కు పైగా ఓటర్లు ఉండటంతో బీఎల్ఓలపై అధిక భారం పడడంతో పాటు గ్రామ ఓటర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందువల్ల అక్కడ అదనపు బూత్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక బీఎల్ఓను నియమించాలని



కోరారు. అలాగే పొట్లపల్లి గ్రామ పరిధిలోని దేవేంద్రనగర్ వాసులు వాగును దాటి గ్రామంలోకి రావాల్సి రావడం వల్ల రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం దేవేంద్రనగర్‌లో కూడా ప్రత్యేకంగా ఒక అదనపు బూత్ ఏర్పాటు చేసి బీఎల్ఓను నియమించాలని కోరుతూ డిప్యూటీ తహసిల్దార్ రుక్మిణికి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశానికి బిజెపి మండల మాజీ అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్, ఉపాధ్యక్షులు భూతగడ్డపు బాలరాజు, బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు తడిసిన రమేష్, బైరి అరుణ్, కార్యదర్శులు బాలగోని మల్లేష్, బూత్ అధ్యక్షులు వంగ శ్రీనివాసరెడ్డి, బొల్లి సుధాకర్, బొమ్మగాని ఈశ్వర్, పోలు సందీప్, గంటల రాజేందర్, గుగులోతు రాములు, గుజ్జుల బాలరాజు, ప్రశాంత్, మెరుగు రవి, సీనియర్ నాయకులు పుదరి కిష్టయ్య, ఇటికాల కుమారస్వామి, పిట్టల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలి

**-విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

తాండూరు, జులై 28 (విజన్ ఆంధ్ర)ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం తాండూరు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో, పట్టణాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గించే చర్యలు చేపట్టడంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.



వ్యవసాయ అవసరాల కోసం రైతులకు నిర్ణీత సమయాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని, అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు ప్రమాదకరంగా మారిన లూజు విద్యుత్ వైర్లను గుర్తించి పకడ్బందీగా సరిచేయాలని ఆదేశించారు.

జలసిరి ఫామ్ పౌండ్లు, వ్యక్తిగత సోక్ పిట్స్ అమలుపై

# రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ శిక్షణ

**- చౌటకూర్ మండలంలో పంచాయతీ సిబ్బందికి అవగాహన -- అభివృద్ధి పనుల సమర్థ అమలుపై అధికారుల దిశానిర్దేశం**

చౌటకూర్, జూలై 28 (విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండల కేంద్రంలో మంగళవారం జలసిరి ఫామ్ పౌండ్లు, వ్యక్తిగత సోక్ పిట్స్ (ఇంకుడు గుంతలు) అమలుకు సంబంధించి రాష్ట్రస్థాయి నుంచి ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లకు ఈ శిక్షణ అందించారు.

శిక్షణలో జలసిరి ఫామ్ పౌండ్ల నిర్మాణ విధానం, వ్యక్తిగత సోక్ పిట్స్ ఏర్పాటు, పనుల ఎంపిక, నాణ్యతా ప్రమాణాలు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనుల అమలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై రాష్ట్రస్థాయి నిపుణులు సమగ్రంగా వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుద్ధ్య మెరుగుదల లక్ష్యంగా ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కే. శంకర్, సహాయ ప్రాజెక్టు అధికారి (ఏపీఓ) రామ్మోహన్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ మహేశ్వర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్ రెడ్డి, రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొని శిక్షణను పూర్తిచేశారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గ్రామాల్లో జలసిరి ఫామ్ పౌండ్లు, వ్యక్తిగత సోక్ పిట్స్ పనులను నాణ్యతతో, వేగవంతంగా అమలు చేసి గ్రామీణాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# ప్రతి ఓటు కీలకం..

**ఎస్ఐఆర్‌ను నిర్లక్ష్యం చేయొద్దు - సిరిపురంలో బీఎల్ఏలతో కాంగ్రెస్ నాయకుల సమావేశం**



మర్పల్లి, జులై 28 (విజన్ ఆంధ్ర) మండలంలోని సిరిపురం గ్రామంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ కన్వీనర్ చామల రఘుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల సురేష్, గూడెం రాములు యాదవ్ బీఎల్ఏల, కాంగ్రెస్ నాయకులతో, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కన్వీనర్ చామల రఘుపతి రెడ్డి,మాట్లాడుతూ ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైనదని, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

మండలంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని బీఎల్ఏలకు సూచించారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక శ్రద్ధతో బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారని చామల రఘుపతి రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి అందజేస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో సిరిపురం ఉప సర్పంచ్ రత్నం, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకరయ్య గౌడ్, లక్ష్మారెడ్డి, వీరారెడ్డి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమా పరిశీలిం

అక్కన్నపేట, జూలై 28 (విజన్ ఆంధ్ర) : భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఎస్ఐఆర్ (Ⅰ×=) ప్రవాస్ అభియాన్‌లో భాగంగా మండలంలోని పలు బూత్‌లను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మాజీ సెన్సార్ బోర్డు సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల రెడ్డి సందర్శించి కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బీఎల్ఏ-2లు, బూత్ అధ్యక్షులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఇప్పటికే 93 శాతం ఎన్యుమరేషన్ పూర్తయిన నేపథ్యంలో మిగిలిన ప్రక్రియను కూడా 100 శాతం పూర్తి చేసేలా ప్రతి బీఎల్ఏ-2, బూత్ అధ్యక్షుడు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఫైనల్ ఓటర్ల జాబితా విడుదలయ్యే వరకు ప్రతి ఓటరు వివరాలను నిశితంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, మండల ఉపాధ్యక్షులు జగదీశ్ చారి, అర్జున్ నాయక్, మండల కార్యదర్శి కళ్యాణ్ విష్ణు, వివిధ మోర్చాల అధ్యక్షులు కుంట స్వప్న, సాలేంద్ర తిరుపతి, గిరిమల్ల రాజు, గంగుల కుమార్, రవీంద్ర చారి, కొండే సంజీవరెడ్డి, కట్కూర్ ప్రభాకర్ రెడ్డి, బొంకూరి పోలో, రజనీకాంత్, దారణ రాజు, జిల్లా కనకయ్య, శ్రీనివాస్ రెడ్డి, వేముగంటి తేజ, వద్లూరి సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఆర్మూర్ నిజామా బాద్ జిల్లా జూలై 28 ( విజన్ ఆంధ్ర) ఈరోజు ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఐక్య విద్యార్థి సంఘాలు దీఎవీ. ఖూఖీ×. చీూఖ× ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను పెద్ద ఎత్తున నినాదాలతో భారీ ర్యాలీతో వచ్చి దాహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో నేటితరం జంజీలు నెట్ పేపర్ లీకేజీ కు వ్యతిరేకంగా గత నెల రోజులుగా అన్ని రాష్ట్రాల్లో రాజధాని కేంద్రమైనటువంటి జంతర్ మంతర్ విరోచిత పోరాటం చేస్తున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లకు త లొగ్గి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రిత్వ శాఖ రాజీనామా చేయడం జరిగింది. అదే క్రమంలో జరుగుతున్న నిరసనలో భాగంగా విద్యార్థిని విద్యార్థి లోకమంతా పార్లమెంటు వైపు వాటి ముట్టడి అడుగులు వేయగా తెలంగాణ రాష్ట్ర చేవెళ్ల ఎంపీ గా ఉన్నటువంటి కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ దేశంలో నిరసన తెలిపిన వారిని కేవలం లాటి చార్జి చేశారు కానీ ఇతర దేశాలలో కాల్చి చంపుతారు అంటూ వారిని వారి ఉద్యమాన్ని చులకన చేసి హింస పే రేపిత వాక్యాలను చేసినటువంటి కొండ విశ్వేశ్వర్ రెడ్డి పైన బిజెపి పార్టీ పైన చర్యలు తీసుకొని బర్తర ఫ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి అలాగే రెండు నాలుకల ధోరణితో ఉన్నటువంటి



కొండ విశ్వేశ్వర రెడ్డి తెలంగాణ ఉద్యమ కాలంలో టిఆర్ఎస్ తరఫున గెలిచినటువంటి ఆయన ఈరోజు విద్యార్థుల మేధావులు రాష్ట్ర ప్రజలు పోరాటంతోనే అన్ని సాధించుకుంటామని చెప్పినటువంటి ఈయన ఈరోజు ఇలాంటి హింసప్రేపిత వాక్య చేయడాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేసినటువంటి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని యావత్తు దేశ విద్యార్థి లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకపోతే కొండా విశ్వేశ్వర్ రెడ్డికి శవ యాత్ర చేపడతామని ఈ సందర్భంగా విద్యార్థులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో దీఎవీ. ఉమ్మడి రాష్ట్రాల కోఆర్డినేటర్ బట్టు శ్రీధర్ ఖూఖీ×. జిల్లా అధ్యక్షుడు సిద్ధల నాగరాజ్ చీూఖ×. జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్ విద్యార్థి నాయకులు జవహర్ సురేందర్ యువ నాయకులు రాజేష్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# ఓటు హక్కు కోల్పోకుండా ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించండి

చేవెళ్ల, జూలై 28 (విజన్ ఆంధ్ర): ఓటు హక్కు కోల్పోకుండా అర్హులైన ప్రతి ఓటరు శనివారంలోగా ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్ఓలకు సమర్పించాలని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఆగస్టు 3 నాటికి ఈ ప్రక్రియ పూర్తికానున్న నేపథ్యంలో చివరి వరకు వేచి చూడకుండా అర్హులైన ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను ముందుగానే సమర్పించాలని సూచించారు. ఫారం సమర్పించని వారికి ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, పట్టణ ప్రజలు ఆ సేవలను సద్వినియోగం చేసుకుని గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కమిషనర్ బి. యాదగిరి కోరారు.



# నూతన సీఐకి శుభాకాంక్షలు తెలిపిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

చేవెళ్ల, జులై 28 (విజన్ ఆంధ్ర): ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బేగరి ప్రభాకర్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు మంగళవారం చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ కట్టా నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని, నేర నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎంజాల వినోద్ కుమార్, చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్లేపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కావలి గణేష్, కావలి లక్ష్మీనారాయణ, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



## పాము కాటుకు పదో తరగతి విద్యార్థి మృతి

**- తాడిచర్లలో చోటు చేసుకున్న విషాదం**



మల్హర్, జూలై 28 విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో పాము కాటుతో పదో తరగతి విద్యార్థి ఎండి రిజ్వాన్ (15) మృతి చెందిన విషాద సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. రిజ్వాన్ తండ్రి అనారోగ్యంతో భూపాలపల్లి ఆసుపత్రిలో చేరడంతో, తల్లిదండ్రులు అక్కడే ఉన్నారు. దీంతో రిజ్వాన్ రాత్రి ఇంట్లో ఒంటరిగా పడుకున్నాడు. తెల్లవారుజామున గుర్తు తెలియని విష కీటకం కుట్టడంతో ఫోన్ ద్వారా భూపాలపల్లిలోని తల్లికి సమాచారం ఇచ్చాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు స్థానిక బంధువులకు తెలుపగా బంధువులు వచ్చేసరికి బాలుడి పరిస్థితి విషమించింది. వెంటనే తాడిచర్ల పీహెచ్‌సీకి, అక్కడి నుండి భూపాలపల్లి ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే రిజ్వాన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రిజ్వాన్ మరణంతో గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కాగ సంఘటన పై కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాండూర్‌లో భూ రీ-సర్వేపై కలెక్టర్ కుమార్ దీపక్ సమీక్ష

బెల్లంపల్లి జూలై 28 విజన్ ఆంధ్ర : ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు కష్టతరమైన నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆర్థికంగా లాభపడాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం తాండూర్ మండలం ద్వారకాపురంలో నిర్వహిస్తున్న భూ రీ-సర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. భూ రికార్డులను పారదర్శకంగా మ్యాపింగ్ చేసి హద్దులు ఖరారు చేయడం ద్వారా భవిష్యత్తులో వివాదాలు తగ్గుతాయని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తాండూర్ రైతు వేదికలో నిర్వహించిన రాయితీ విత్తనాలు, ఎరువుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ జ్యోత్స్న వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి రోడ్డుపైకి వచ్చిన కొండచిలువ.. చక్రియాల గ్రామంలో కలకలం

**- వాహనాలు ఆపి వీడియోలు తీసిన ప్రజలు.. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని సూచన**

చౌటకూర్, జూలై 28 (విజన్ ఆంధ్ర ):- చౌటకూర్ మండలం పరిధిలోని చక్రియాల గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షం అనంతరం అరుదైన ఘటన చోటుచేసుకుంది. పంట పొలాల నుంచి బయటకు వచ్చిన ఓ పెద్ద కొండచిలువ గ్రామ సమీపంలోని రహదారిని దాటుతూ కనిపించడంతో అక్కడి ప్రజలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు.ఆ సమయంలో శివంపేట నుంచి చక్రియాల గ్రామానికి వస్తున్న వాహనదారులు తమ వాహనాలను నిలిపివేసి కొండచిలువను ఆసక్తిగా వీక్షించారు. పలువురు తమ మొబైల్ ఫోన్లలో వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి.ఈ ఘటనతో కొంతసేపు రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం కొండచిలువ సమీపంలోని పొదల్లోకి వెళ్లిపోవడంతో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, వర్షాకాలంలో పాములు, కొండచిలువలు వంటి అడవి జీవులు నీటి ప్రవాహాల కారణంగా రహదారులపైకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే వాహనాలను సురక్షితంగా నిలిపి, వాటిని రెచ్చగొట్టకుండా సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని



# స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు

**- సాధించిన గట్ల మల్యాల విద్యార్థిని షణ్ముఖ ప్రియ"**

నంగునూరు మండలం జూలై 28 విజన్ ఆంధ్ర సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బానోతు షణ్ముఖప్రియ స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. స్పోర్ట్స్ కోటాలో సీటు సాధించడం అత్యంత ప్రతిభ, కృషి, క్రమశిక్షణకు నిదర్శనమని విద్యావేత్తలు పేర్కొన్నారు. ఈ విజయంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో గట్ల మల్యాల ఉన్నత పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల సంఖ్య ఐదుకు చేరింది. ప్రధానోపాధ్యాయులు మాదాసి రమేశ్ మాట్లాడుతూ షణ్ముఖ ప్రియ సాధించిన విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమని అన్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణిస్తూ స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం గొప్ప విజయమని పేర్కొన్నారు. విద్యార్థినిని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయులు దర్శనాల రాజ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ సర్పంచి ఇంగ నరేశ్, ఉపసర్పంచ్ తిప్పని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ తిరుమలతో, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు



హర్షం వ్యక్తం చేశారు. షణ్ముఖ ప్రియ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే అత్యున్నత విజయాలను సాధించగలరనే విషయాన్ని షణ్ముఖ ప్రియ నిరూపించిందని గ్రామస్తులు, ఉపాధ్యాయులు కొనియాడారు. ఆమె విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# ప్రేమ ఒక్కటే సరిపోదు... జీవితానికి పరిపక్వత కూడా కావాలి

ప్రేమ మనిషి జీవితంలో అత్యంత అందమైన అనుభూతుల్లో ఒకటి. ఇద్దరు వ్యక్తులు పరస్పరం ఇష్టపడటం, కలిసి జీవితాన్ని నిర్మించుకోవాలని నిర్ణయించుకోవడం సహజమైన విషయమే. అయితే ప్రేమ పేరుతో జీవిత వాస్తవాలను, కుటుంబ బంధాలను, బాధ్యతలను పూర్తిగా పక్కన పెట్టడం మాత్రం సమాజం ఆలోచించాల్సిన అంశంగా మారుతోంది. ఈ రోజుల్లో "మేము మేజర్లం... మా జీవితంపై నిర్ణయం మాదే" అనే వాదన ఎక్కువగా వినిపిస్తోంది. చట్టం ప్రకారం అది వారి హక్కే. కానీ ప్రతి హక్కుతో పాటు ఒక బాధ్యత కూడా ఉంటుందనే విషయాన్ని మరచిపోకూడదు. జీవిత భాగస్వామిని ఎంచుకోవడం వ్యక్తిగత నిర్ణయమే అయినప్పటికీ, ఆ నిర్ణయం కుటుంబాలపై, బంధాలపై, భవిష్యత్తుపై చూపే ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఒక బిడ్డ పుట్టిన నాటి నుంచి పెంచి, చదివించి, ప్రతి కష్టంలో అండగా నిలిచి, తమ కలలను పిల్లల భవిష్యత్తులో చూసే వారు తల్లిదండ్రులు. అలాంటి వారి మనసును ఒక్క క్షణంలో బాధపెట్టే నిర్ణయం తీసుకోవడం చట్టబద్ధమైన హక్కు కావచ్చు; కానీ అది భావోద్వేగపరంగా, నైతికంగా ఎంతవరకు సరైనదో ప్రతి యువకుడు, యువతి ఒక్కసారి ఆలోచించాలి.

ప్రేమలో ఉన్నప్పుడు ప్రపంచం ఎంతో అందంగా కనిపిస్తుంది. కానీ వివాహం తర్వాత జీవితం అసలు పరీక్షను ప్రారంభిస్తుంది. ఉద్యోగం, ఆదాయం, ఆర్థిక స్థిరత్వం, కుటుంబ బాధ్యతలు, ఆరోగ్య సమస్యలు, పిల్లల పెంపకం, అభిప్రాయ భేదాలు---ఇవన్నీ జీవితంలో భాగమే. ఆ సమయంలో ప్రేమతో పాటు సహనం, బాధ్యత, పరస్పర గౌరవం,



రాజీ పడే మనస్తత్వం కూడా అవసరం అవుతాయి.

ప్రతి ప్రేమ వివాహం విఫలమవుతుందని చెప్పడం ఎంత అవాస్తవమో, ప్రతి పెద్దలు కుదిర్చిన వివాహం విజయవంతమవుతుందని చెప్పడం కూడా అంతే అవాస్తవం. వివాహం విజయాన్ని నిర్ణయించేది వివాహం జరిగిన విధానం కాదు; దాన్ని నిలబెట్టే వ్యక్తుల పరిపక్వత, నమ్మకం, బాధ్యత, పరస్పర గౌరవమే.

అభిప్రాయ భేదాలు ప్రతి కుటుంబంలో ఉంటాయి. కానీ సంభాషణ లేకపోవడం సమస్యలను మరింత పెంచుతుంది. పిల్లలు తమ మనసులోని మాటను తల్లిదండ్రులతో పంచుకోవాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల అభిప్రాయాలను ఓపికగా వినాలి. ప్రేమతో జరిగిన సంభాషణ ఎన్నో విభేదాలను పరిష్కరించగలదు.

యువత గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, మేజర్ కావడం అంటే కేవలం చట్టపరమైన హక్కు పొందడం మాత్రమే. జీవితాన్ని సంతోషంగా, విజయవంతంగా నడిపించే పరిపక్వత మాత్రం అనుభవంతో, బాధ్యతతో, పెద్దల సలహాలతో పెరుగుతుంది.

అలాగే తల్లిదండ్రులు కూడా కాలానికి అనుగుణంగా ఆలోచించాలి. పిల్లల అభిరుచులను పూర్తిగా తిరస్కరించకుండా, వారి ఆనందం, భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలి. పరస్పర విశ్వాసం ఉన్న కుటుంబాల్లో విభేదాలు శాశ్వత సమస్యలుగా మారవు.

ప్రేమను గెలవడం గొప్ప విషయం. కానీ కుటుంబాన్ని కోల్పోకుండా ప్రేమను గెలవడం మరింత గొప్ప విషయం. హక్కులు ఎంత ముఖ్యమో, బాధ్యతలు కూడా అంతే ముఖ్యమైనవి. స్వేచ్ఛ ఎంత విలువైనదో, కుటుంబ బంధాలు కూడా అంతే విలువైనవి.

ముగింపు

వివాహం ఒక రోజు జరిగే వేడుక కాదు; అది జీవితాంతం కొనసాగే బాధ్యత. భావోద్వేగంతో కాదు, పరిపక్వతతో తీసుకున్న నిర్ణయాలే వ్యక్తిని, కుటుంబాన్ని, సమాజాన్ని బలపరుస్తాయి. యువత తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాలి. తల్లిదండ్రులు ప్రేమతో, పిల్లలు గౌరవంతో ముందుకు వస్తేనే కుటుంబ వ్యవస్థ బలపడుతుంది. బలమైన కుటుంబాలే బలమైన సమాజానికి నిజమైన పునాది.

ఈ వ్యాసం సంపాదకీయ శైలిలో, సమతుల్య దృక్పథంతో, పత్రికలో ప్రచురించడానికి అనువుగా రూపొందించబడింది.

లికె కనకరాజ్ గౌడ్ పెద్ద శంకరంపేట్‌లి

# పచ్చదనమే భవిష్యత్‌కు భరోసా

**-తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం**

**-సర్పంచ్ లు రాణి మల్లేష్,శ్యామల ప్రవీణ్**

-మర్కుక్ జూలై 28,(విజన్ ఆంధ్ర ) :వన మహోత్సవాన్ని పురస్కరించుకొని మర్కుక్ మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో మంగళవారం నాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం ఆధ్వర్యంలో మర్కుక్ సర్పంచ్ రాణి మల్లేశం,గంగాపూర్--యూసుఫ్ఖాన్‌పల్లి సర్పంచ్ శ్యామల ప్రవీణ్ కలిసి పాఠశాల ఆవరణలో వివిధ రకాల నీడ,పండ్ల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని అన్నారు.మొక్కలు పెంచడం ద్వారా స్వచ్ఛమైన గాలి,పచ్చని పరిసరాలు,భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు.వారితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు,ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 14వ వార్డులో పారిశుధ్య పనులు

**- బిలాల్ మసీదు ఆవరణలో క్రిమిసంహారక మందుల పిచికారీ**

గజ్వేల్, 28 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు బిలాల్ మసీదు పరిసరాల్లో మున్సిపల్ సిబ్బందితో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బిలాల్ మసీదు గుమ్మటం చుట్టుపక్కల విపరీతంగా పిచ్చి గడ్డి పెరిగినందున, దోమలు మరియు విషపూరిత పురుగులు వ్యాపించే అవకాశం ఉ oదని మసీదు కమిటీ సభ్యులు స్థానిక కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన కౌన్సిలర్, మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిని రంగంలోకి దించారు. వార్డు ప్రజలు ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని మసీదు ఆవరణలో పాటు పరిసర ప్రాంతాల్లో గడ్డి మందు, దోమల నివారణ మందు కొట్టించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వార్డు వ్యాప్తంగా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు.



ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సకాలంలో స్పందించి పారిశుధ్య పనులు పూర్తి చేయించినందుకు మసీదు కమిటీ సభ్యులు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షకీల్, నవీద్, హజం సలీం, ఆసిఫ్, బాలరాజు, కుమార్, జవాన్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

## దోమ మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జిగా బొంపల్లి వెంకటేష్ మాదిగ



దోమ జూలై 28,(విజన్ ఆంధ్ర) : ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలలో భాగంగా దోమ మండల ఇన్చార్జిగా బొంపల్లి వెంకటేష్ మాదిగను ఎమ్మార్పీఎస్ నేతలు తాత్కాలికంగా నియమించారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి అనునిత్యం కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడు పేదలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలో నూతన కమిటీలు ఏర్పాటు అవుతాయని, మండల అధ్యక్ష, కార్యదర్శుల నియమకాలు జరుగుతాయన్నారు. అప్పటి వరకు తాత్కాలికంగా ఇన్చార్జిగా కొనసాగుతామని ఆయన తెలిపారు.

# కళ్లకు గంతలు కట్టుకుని బీఆర్ఎస్ ధర్నా.. నిరసన..

## పట్టణ సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్

బెల్లంపల్లి, జూలై 28 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గుంతలతో అధ్వాన్నంగా మారిన రహదారులను తక్షణమే మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం కాంటా చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కళ్ళకు గంతలు కట్టుకుని వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ పట్టణంలోని రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలు నిత్యం ప్రమాదాల మధ్య ప్రయాణిస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని కోరారు. రోడ్ల విస్తరణ పేరుతో అనేక కుటుంబాలు ఇళ్లు, దుకాణాలు కోల్పోయినా వారికి న్యాయం చేస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. రహదారుల అభివృద్ధి పేరుతో నిధులు వసూలు చేసి పనులను పూర్తి చేయకుండా వదిలేశారని విమర్శించారు. గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అభివృద్ధిపైనా నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి పట్టణాభివృద్ధిపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని గుంతల రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, రోడ్ల విస్తరణలో నష్టపోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్ట్ లకు కేటాయించిన స్థలం వారికీ పంపిణీ చేయాలి, వారి స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలి, ప్రభుత్వ 100పడకల ఆసుపత్రిలో కాలిగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలి, అలాగే 76జీవో అమలు చేసి పట్టణ ప్రజలకు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, పట్టణ అధ్యక్షుడు నూనేటి సత్యనారాయణ, రేవెల్లి విజయ్, సబ్బని అరుణ్, కౌన్సిలర్లు తాండ్ర ప్రవంతి, బండారి ప్రవంతి, బెడ్డల సౌజన్య,ఎస్ కె సిమ్రాన్, సల్ల కృష్ణవేణి , గోగర్ల స్వప్న, కొయ్యాడ ప్రసన్న,అసాది మధు ,దొంగల రాజ్‌కుమార్, కాంపెల్లి రాజం, బీఆర్ఎస్ నాయకులు సబ్బని అరుణ్, ఏలూరి వెంకటేష్, మురుకూరి శ్రావణ్, అసం అఖిల్, మానడి శ్రీదేవి, శ్రీరాములు,రాజులాల్ యాదవ్, బండారి శ్రీనివాస్,గోగర్ల సత్యనారాయణ, ఎండి హనీఫ్, ఆకుల సాయి, గద్దల దర్మేంద్ర కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని ఖాళీ చేయాలి



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూలై 28 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని ఖాళీ చేయించాలని కోరుతూ సంఘం ప్రతినిధులు సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా తాత్కాలికంగా రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారని, రిటైర్డ్ ఉద్యోగుల కార్యకలాపాలు నిర్వహించుటకు భవనం అవసరం ఉన్నదన్నారు.హుస్నాబాద్ డివిజన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తక్కలపల్లి రాజగోపాల్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. లింగారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి చంద్రమౌళి కలిసి సిద్దిపేటకు వెళ్లి, జిల్లా అధ్యక్షుడు ఆర్. రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జైన్ సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు కృపాసాగర్‌తో కలిసి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.సంఘం భవనంలో ప్రస్తుతం కొనసాగుతున్న గ్రంథాలయాన్ని ఖాళీ చేసి భవనాన్ని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యకలాపాలకు అందుబాటులోకి తీసుకురావాలని వినతిపత్రంలో కోరారు.ఈ అంశంపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# లివర్‌లో ఇన్ఫెక్షన్‌ను నిర్లక్ష్యం చేయడం చాలా ప్రమాదం

## - డాక్టర్ చైతన్య ఆనంద్

గజ్వేల్, 28 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : లివర్‌లో వచ్చే ఇన్ఫెక్షన్ ను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ఇది చాలా ప్రమాదమని డాక్టర్ చైతన్య ఆనంద్ అన్నారు. లివర్ మన శరీరంలో సైలెంట్ ఆర్గాన్ నొప్పి ఎక్కువగా చెప్పదు. అందుకే చాలా మంది జస్ట్ గ్యాస్ లేదా అలసట అని వదిలేస్తారు. కానీ లోపల లివర్ దెబ్బతింటూ ఉంటుంది.

**నిర్లక్ష్యం చేస్తే ఏమవుతుంది :**

1. నిర్లక్ష్యం చేయడం వల్ల తీవ్రమైన లివర్ డ్యామేజ్ కు దారితీస్తుందని దీనివల్ల హెపటైటిస్ బి, సి లాంటివి సంవత్సరాల పాటు లోపలే ఉ oడి లివర్ ను గట్టిపరుస్తాయి. దీన్ని సిర్రోసిస్ అంటారు.

2. లివర్ ఫెయిల్యూర్ చివరికి లివర్ పని చేయడం ఆపేస్తుంది దానితో అప్పుడు మనకు వ్యాధి గురించి తెలియడం జరుగుతుంది.

3. లివర్ క్యాన్సర్ బి మరియు సి దీర్ఘకాలికంగా ఉంటే వచ్చే రిస్క్ ఎక్కువ క్యాన్సర్ ముదిరి బయటపడే అవకాశం ఉంటుంది.

4. కామెర్లు, కడుపులో నీరు, కాళ్ళు వాపు లాంటి సమస్యలు బయటపడి చికిత్సకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతుంది ఒక్కసారి తీరు రూపం దాల్చే ప్రానా నికి ముప్పు కలుగుతుంది అని డాక్టర్ చైతన్య ఆనంద్ తెలిపారు. పైన చెప్పిన విధంగా ఏ చిన్న అవస్థ కనిపించినా వెంటనే ఏం చేయాలి అంటే లివర్ ఫంక్షన్ టెస్ట్ , హెచ్ బి ఏ సి , ఆంటీ హెచ్ సి వి బ్లడ్ టెస్టులు చేయించుకోవాలి. అలాగే త్వరగా సమీపంలో గల జనరల్ ఫిజీషియన్ లేదా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ నంప్రదించి తగిన



సలహాలు సూచనలు తీసుకోవాలని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడినవారు మద్యాన్ని సేవించవద్దు లివర్ ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు మద్యం విషం లాంటిది, అలాగే సొంత నిర్ణయాలు తీసుకుని మందులు సొంతంగా వేసుకోవద్దు పారాసెటమాల్ లాంటివి కూడా లివర్ పై ఎఫెక్ట్ చూపుతాయి. ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే లివర్ కు తిరిగి బాగయ్యే శక్తి ఉంటుంది. కానీ దాన్ని మనం టైం లో పెట్టుకోవాలి. హెపటైటిస్ బి కి వ్యాక్సిన్ ఉంది. సి కి ఇప్పుడు పూర్తిగా నయం చేసే మందులు ఉన్నాయి అని తెలిపారు. ఆరోగ్యం ఉంటేనే అన్నీ బాగుంటాయి అనే విషయాన్ని మర్చిపోవద్దు. లివర్ బాగుంటేనే మనం హుషారుగా ఉండడం జరుగుతుందని డాక్టర్ చైతన్య ఆనంద్ తెలిపారు.

# డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

కుల్కచర్ల, జూలై, 28 (విజన్ ఆంధ్ర): డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కుల్కచర్ల ఎంపీడీవో రామకృష్ణ నాయక్ తెలిపారు. కుల్కచర్ల మండలం ముజాహిద్ పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సమీక్షా సమావేశంలో పాల్గొని బీఎల్ఓలు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ... ఎస్ఐఆర్ గడువు ముగిసే సమయం దగ్గరపడుతున్నందున వివరాలను ఆన్ లైన్ లో త్వరగా అప్లోడ్ చేయాలని సూచించారు. ఇప్పటికే కొన్ని గ్రామ పంచాయతీల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయబడిందని చెప్పారు. తప్పుల్లేకుండా ఓటర్ల వివరాలను నమోదు చేయాలని వివరించారు. ఇంకా ఎవరైనా ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందజేయకుంటే త్వరగా ఇవ్వాలని తెలిపారు. ఓటు హక్కును కోల్పోకుండా ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్



కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఆయా గ్రామాల సర్పంచులు చంద్రభూపాల్ రావు, నర్సిములు యాదవ్, పంచాయతీ కార్యదర్శులు సంతోష్, అశోక్, నాయకులు భాస్కర్, వెంకట్, బాలకిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

**- మాసం అనిల్ కుమార్**

బోథ్. జూలై.28. (విజన్ ఆంధ్ర) యువత అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం బోథ్ మండల కేంద్రం లోని మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే కుట్టు మిషన్ కేంద్రం లో ప్రథమ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణ అవగాహన కార్యక్రమంకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 - 35 సంవత్సరాలు ఉన్న యువతి యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలనీ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మాసం లక్ష్మీ వెల్ఫేర్ కార్యాలయం లో సంప్రదిస్తే సొసైటీ ఖర్చులు తో పంపిస్తాం అని తెలిపారు. అనంతరం ప్రథమ్ కమ్యూనిటీ మొబిలైజర్ పసుల రమేష్ మాట్లాడుతూ ఈ శిక్షణ ఎందరికో ఉపాధి చూపెట్టిందనీ, పూర్తి ఖర్చును సంస్థనే భరిస్తుందనీ అన్నారు. ఈ శిక్షణ నిర్మల్ జిల్లా లోనీ ఉంటుందని అన్నారు. ఇందులో హోటల్ మెనేజ్మెంట్,సోలార్,మిషిన్,టు వీలర్ రిపేర్ ఉన్నాయి అని కనుక యువతి యువకులు ఈ అవకాశం వినియోగించుకోవలి అని ఈ కార్యక్రమం నిర్వహించడానికి సహాయ పడ్డ మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లో సీనియర్ రిపోర్టర్ చంద్రకాంత్ రెడ్డి మరియు కుట్టు మిషన్ కేంద్రం ఇంచార్జి శ్రీజ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# లింగారావుపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..

తలకొండపల్లి , జూలై 28, (విజన్ ఆంధ్ర):"రక్తం దానం... ప్రాణానికి ప్రాణం" అనే సందేశంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సహకారంతో, లయన్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం లింగారావుపల్లిలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి

భాగ్య స్వాములు అయ్యారు.

కెనరా బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి,

కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ముఖ్యంగా 150 సార్లు రక్తదానం చేసిన లయన్ అంజిరెడ్డి సేవలను అభినందిస్తూ, ఆయన సేవ స్ఫూర్తి యువతకు ఆదర్శమని అన్నారు.

లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. "అన్ని దానాల్లో రక్తదానం అత్యున్నతమైనది. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు.



రక్తదానం పట్ల యువతలో మరింత అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర సమయాల్లో రక్తం కొరత లేకుండా ఉండేందుకు ఇలాంటి శిబిరాలను నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో

లయన్స్ క్లబ్

పి ఆర్ ఓ పాష,

లయన్ రవీందర్

రెడ్డి, వివిధ యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందేలా అధికారులు కృషి చేయాలి

**-భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు**

వెంకటాపురం (నూగూరు) జూలై 28 (విజన్ ఆంధ్ర): ములుగు జిల్లా, వెంకటాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు అవసరమైన సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక గ్రంథాలయ భవన నిర్మాణం నత్తనడక

**- శివంపేట జెడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తిగా గ్రంథాలయ భవనం.. ఉపాధ్యాయుల ఆందోళన**

**- పనులు వేగవంతం చేయాలని సర్పంచ్, ఉపాధ్యాయుల విజ్ఞప్తి**



చౌటకూర్, జూలై 28 (విజన్ ఆంధ్ర):- చౌటకూర్ మండలంలోని శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనం పనులు నత్తనడకన సాగుతున్నాయని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభమై చాలా కాలం గడిచినా ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. స్థానిక సమాచారం ప్రకారం, నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు ఇప్పటివరకు బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు మందగించాయని తెలుస్తోంది. అయితే నిర్మాణంలో ఇప్పటికే కొన్ని చోట్ల గోడలకు పగుళ్లు (క్రాక్‌లు) కనిపిస్తున్నాయని, కొన్ని పిల్లర్ల నిర్మాణంపై కూడా సందేహాలు ఉన్నాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో స్పందన లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఆగస్టు నెలలోపు గ్రంథాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ గతంలో హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ పనుల్లో పురోగతి కనిపించడం లేదన్నారు. గ్రామ సర్పంచ్ కూడా పలుమార్లు ఫోన్ ద్వారా పనులు వేగవంతం చేయాలని సూచించినప్పటికీ, కాంట్రాక్టర్ మాటలకే పరిమితమవుతున్నారని తెలిపారు. పాఠశాలలో



విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించడంతో పాటు నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయించాలని ఉపాధ్యాయులు, గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే నిర్మాణ నాణ్యతపై కూడా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహణ

**- పట్టణాభివృద్ధి, ప్రజారోగ్యమే లక్ష్యంగా నిర్ణయాలు**

**- మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్**

గజ్వేల్, 28 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పురపాలక సంఘం సాధారణ సమావేశం మంగళవారం రోజు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించబడింది. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కార్ పద్మబాయి నర్సింగరావు సమక్షంలో ఈ సమావేశం జరిగింది. పురపాలక పరిధిలోని వివిధ వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పనితీరుపై సమగ్రంగా చర్చించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత వేగవంతం చేయాలని, వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పాలకవర్గం, అధికారులు సమిష్టిగా కృషి చేస్తూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గోలి రాముకు ఘన సన్మానం

జన్నారం, జులై 28 (విజన్ ఆంధ్ర): లయన్స్ కల్బ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గోలి రామును పలు వురు మండల నాయకులు ఘనంగా సన్మానించా రు. జన్నారం మండల లయన్స్ క్లబ్ నూతన ప్రధా న కార్యదర్శిగా ఎన్నికైన గోలి రాముని మంగళవా రం రోజున మండలకేంద్రంలో పలువురు నాయకు లు, మిత్రులు శాలువా కప్పి సత్కరించి గంగాదేవి పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోలి రాము సమాజసేవలో విశే షంగా కృషి చేస్తూ లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల నాయ కులు గోలి చందు, కోడి సృజన్, సంద వేణి పవన్, యాదవ్ కొండ పల్లి మహేష్ జన్నారం మండలం జనసేన అధ్యక్షుడు మూగల వెంకటేష్ పాల్గొన్నా రు.



# పుల్కల్‌లో రూ.18 లక్షలతో సీసీ డ్రైనేజీ పనులకు శ్రీకారం

**-గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం: సర్పంచ్ లావణ్య--కృష్ణారెడ్డి**

చౌటకూర్, జూలై 28: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ లావణ్య--కృష్ణారెడ్డి మంగళవారం టెంకాయ కొట్టి ప్రారంభించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య--కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆశీస్సులు, సహకారంతో గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సుమారు రూ. 18 లక్షల వ్యయంతో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నామని, పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ), గ్రామ కార్యదర్శి ప్రవీణ్, ఉపసర్పంచ్ ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు చింత నరేందర్, మంగలి రాజు, కనిగిరి మల్లేశం, మాజీ సర్పంచ్ శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, మాజీ సర్పంచ్ మఠం సిద్దయ్య, మల్లారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి పనులు వేగవంతం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం: సర్పంచ్ లావణ్య--కృష్ణారెడ్డి

# ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాలి...

**జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్..**

బోధన్, జులై 28(విజన్ ఆంధ్ర) : జల సంరక్షణ, పరిశుభ్రతపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యంగా బోధన్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ మండల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి గ్రామాన్ని సుందరంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ విచ్చేసి మాట్లాడుతూ.. భూగర్భ జలమట్టాన్ని పెంచడానికి, పరిసరాల పరిశుభ్రతను కాపాడడానికి స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. వర్షపు నీరు వృధాగా పోకుండా ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతను నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయంలో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి,



భూమిలో తడి శాతాన్ని పెంచడానికి ప్రతి పొలంలోనూ ఇంకుడు కుంటలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్లపై పారకుండా, దోమలు వృద్ధి చెందకుండా మురుగు గుంతలను నిర్మించాలని స్పష్టం చేశారు. నీటి సంరక్షణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ?ఈ సమావేశంలో డి. ఎల్. పి. ఓ. నాగరాజు, మండల విద్యాధికారి నాగయ్య, వివిధ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# క్షయ రహిత భారత్ మన అందరి లక్ష్యం

నిజామాబాద్ జులై28:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో మంగళవారం ఈ రోజు నిర్వహించిన టీబీఎంబీఏ 2.0 మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ డా. రాజశ్రీ మేడమ్ గమరియు డీటీసీఓ డా. దేవి నాగేశ్వరి మేడమ్ సందర్శించారు.

28వ వార్డు కార్పొరేటర్ శ్రీ మహేందర్ నిక్షయ్ మిత్రగా సేవలందిస్తున్న నేపథ్యంలో, క్షయవ్యాధి రోగులకు అందిస్తున్న విలువైన సహకారానికి గుర్తింపుగా డీఎంహెచ్ఓ మేడమ్, డీటీసీఓ మేడమ్ మరియు ఎస్ఆర్ నగర్ యూపీహెచ్‌సీ సిబ్బంది కలిసి కార్పొరేటర్ గారిని ఘనంగా సత్కరించారు.

అదేవిధంగా, ఛాతీ ఎక్స్-రే, ఇతర ఉచిత వైద్య పరీక్షలు వంటి అవసరమైన ఆరోగ్య సేవలను ప్రజలకు వారి వార్డులోనే అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజారోగ్య పరిరక్షణకు విశేషంగా కృషి చేసినందుకు కృతజ్ఞతా సూచకంగా 28వ వార్డు కార్పొరేటర్ మల్కాయి



మహేందర్ గారు నిక్షయ్ మిత్ర గా 4 ఫుడ్ కిట్స్ ఉది రోగులకి ఇచ్చారు.. ఈ కార్యక్రమం లో డీఎంహెచ్ఓ డా. రాజశ్రీ మేడమ్ గారిని మరియు డీటీసీఓ డా. దేవి నాగేశ్వరి మేడమ్ గారిని శాలువాతో సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో క్షయ నియంత్రణ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ధూంధాం కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**ఘనంగా తెలంగాణ ధూంధాం కళాకారుల బోనాల జాతర**

**కళాకారుల ఐక్యతను చాటేందుకు రాష్ట్రంలో మొదటి సారి బోనాలు**

నిజామాబాద్ జులై28:( విజన్ ఆంధ్ర) తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల బోనాల జాతర ఘనంగా నిర్వహించామని జిల్లా అధ్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల వేదిక ఆధ్వర్యంలో బోనాల జాతర కార్యక్రమాన్ని ఐక్యత కోసమే జరిపామన్నారు. మంగళవారం మాక్లూర్ మండలంలోని ఒట్యాట్ పల్లి లో ఒడ్డేటవ్వ వద్ద బోనాలు సమర్పించారు. ముందుగా గ్రామంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి కళాకారులు పూల మాల వేశారు. కామన్ నుంచి డప్పు దరువులతో శివ సత్తుల, పోతరాజు నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం వేదిక ఏర్పాటు చేసి కళాకారులు తెలంగాణ ఉద్యమ ఉద్యమ పాటలు అలరించాయి. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అష్ట గంగాధర్, కోశాధికారి రాంపూర్ సాయి లు మాట్లాడుతూ.. జిల్లా కళాకారుల ఐక్యత చాటేందుకు అమ్మ వారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమం కోసం కష్టపడిన అర్హులైన అన్ని విభాగాల్లో ఉన్న కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని నియోజకవర్గాలలో జిల్లా ధూంధాం కళాకారుల ఆధ్వర్యంలో త్వరలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉపాధ్యక్షురాలు రేలారే రేలా గంగా మాట్లాడుతూ , కళాకారులకు మంచి జరగాలని అమ్మ ఆశీర్వాదం కోసం బోనం సమర్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి కార్యక్రమం మొదటి సారి నిజామాబాద్ లో నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. అన్ని జిల్లాలు మా ఐక్యతను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. తెలంగాణ వచ్చిన కళాకారుల జీవితాలు పూర్తిగా మారలేదని, ఎంతో దుర్భరంగా ఉన్నాయని గుర్తు చేశారు. వెంటనే ప్రభుత్వం కళాకారుల త్యాగాన్ని గుర్తించాలన్నారు. జిల్లా లోని కళాకారులు ఒక కుటుంబంగా ఒకే దగ్గర కలవడం ఉద్యమ సమయాన్ని గుర్తు చేశాయన్నారు. ఉద్యోగాల కోసం కళాకారులు వెయ్యి కండ్లతో ఎదిరి చూస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి అందించే సహాయం తొందరగా అందించాలని కోరారు. ఈ బోనాల కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంగా, గోదావరి, సాయి లోవోల, సవిత, రాజేందర్ , సలహాదారులు పస్నా నర్సయ్య, పాశం కుమార్, బొడ్డెన్న యాదవ్, కోకిల నాగరాజు, సహాయ కార్యదర్శి కర్క రమేష్, క్రాంతి కుమార్, గోరకంటి రాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహేందర్, ప్రశాంత్ రెడ్డి, మహేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు చిట్టిబాబు, మాదాసు గోపి, తోగరి నర్సయ్య, చిన్న రాజేందర్, రవి నాయక్, డప్పు సంతోష్, మనోజ,దివ్య, మానస, స్రవంతి, సమత, లత, శ్వేత జిల్లా ఉద్యమ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందూరు కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

**- సీడీఎంఏ శ్రీదేవిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**

నిజామాబాద్ జులై28:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా కోరారు. సీడీఎంఏ శ్రీదేవిని హైదరాబాద్ లోని కార్యాలయంలో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ప్రధానంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇందూరు అభివృద్ధి కొరకు నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే కార్పొరేషన్ కు రావాల్సిన జనరల్ ఫండ్, ఇతర పనులను మంజూరు చేయాలన్నారు.

## కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసిన ఎంపీ అర్విండ్ ధర్మపురి

ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గడంతో పాటు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు నివారించబడి ప్రయాణ భద్రత మరింత మెరుగుపడుతుందని ఎంపీ వివరించారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు.

అదేవిధంగా, ఇటీవల ఇందల్వాయి మరియు జానకంపేట వద్ద నూతన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ఓబీ) మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ గారికి ఎంపీ అర్విండ్ ధర్మపురి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత మరియు రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అర్విండ్ ధర్మపురి తెలిపారు.

# తాండూర్ వాసికి యునైటెడ్ అమెరికా యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్

మంచిర్యాల బ్యూరో, జులై 28 (విజన్ ఆంధ్ర ) : రక్తదానంతో ప్రాణాలు కాపాడుతూ... పేదలకు చేయూతనిస్తూ... అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తూ మూడు దశాబ్దాలుగా మానవతను ఆచరణలో చూపిన సేవామూర్తికి అంతర్జాతీయ గౌరవం వరించింది.

సమాజ సేవను జీవిత లక్ష్యంగా ఎంచుకుని మూడు దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్న తెలంగాణ యువ సామాజిక సేవకుడికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. అమెరికాకు చెందిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయాలని నిర్ణయించింది. మంచిర్యాల జిల్లా తాండూర్ కు చెందిన కేశెట్టి సంతోష్ కుమార్ సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రకటించింది.

మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రానికి చెందిన అభినవ కల్చరల్ సోషల్ స్పోర్ట్స్ ఎడ్యుకేషనల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేశెట్టి సంతోష్ కుమార్ కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. అమెరికాకు చెందిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ అండ్ ఎక్సలెన్స్ సంస్థ ఆయనకు "డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్" (గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేయాలని అధికారికంగా ప్రతిపాదించింది. ఈ మేరకు 2026 జూలై 17న యూనివర్సిటీ అధికారిక నామినేషన్ సభ్యురాలు డాక్టర్ అభినయ వాసవి ద్వారా మెమొరాండం, ప్రపోజల్ ను పంపించింది. 30 సంవత్సరాలుగా రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, యువతలో సేవా స్ఫూర్తిని పెంపొందించడం వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు ఈ గౌరవానికి ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ పేర్కొంది. 2026 ఆగస్టు 29న పుదుచ్చేరిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేయనున్నట్లు యూనివర్సిటీ వెల్లడించింది. "కష్టాలు... కన్నీళ్లు.... ఎక్కడో... మా చేతులు అక్కడే..." అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ వేలాది మందికి అండగా నిలిచిన సేవామూర్తిగా కేశెట్టి సంతోష్ కుమార్ కు ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్సి కార్పొరేషన్ నిధులు ఇంకెప్పుడు విడుదల చేస్తారు...?

**-ఎస్సి నియోజకవర్గాల్లోని మాల, మాదిగలు బాగుపడేదెప్పుడు**

**-ఉమ్మడి మెదక్ జిల్లా దళిత నాయకులు తలారి దేవరాజ్**

మెదక్ /రేగోడ్ జులై 28(విజన్ ఆంధ్ర ):తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయలేదని ఉమ్మడి మెదక్ జిల్లా దళిత సంఘాల నాయకులు తలారి దేవరాజ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ రెండు సంవత్సరాల్లో ఇంతవరకు ఎస్సి కార్పొరేషన్ లోన్ ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మాల,మాదిగలు అంటే ప్రభుత్వానికి ఇంత చిన్నచూపా.. ఎస్సి నియోజకవర్గాల్లోని మాల, మాదిగలు బాగుపడేదెప్పుడు అని మండిపడ్డారు.ఎస్సీ నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ,మంత్రులు కూడా మీకు ఓట్లు వేసిన ఎస్సీలు గుర్తుకు లేరా.. ... గుర్తుకు రారా.. కనీసం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మీకు ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఏమవుతున్నాయి అని ముఖ్యమంత్రి అడగలేరా.. లేదంటే ప్రభుత్వం ఎస్సి నిధులను వేరే అవసరాలకు వాడుకుంటున్నారా... ఎస్సి కోటాలో ఎమ్మెల్యే, మంత్రులు ఐన మీరు మీ జాతికి ఏం చేస్తున్నారు అని ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. తక్షణమే ఎస్సీ కార్పొరేషన్ నిధులు తెలంగాణలో విడుదల చేయాలి లేకపోతే మాల,మాదిగల అంతా ఏకమై రానున్న రోజుల్లో ఎస్సిల పక్షంలో లేని ఎస్సి మంత్రులు, ఎమ్మెల్యే లకు,రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



# అర్హత కలిగిన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోవద్దు

**-ఓటర్ల నమోదు జాబితాలో ఉన్న చిన్న చిన్న లోపాలను వెంటనే సరిదిద్దాలి**

**- తక్కువ నమోదు, 'నో మ్యాపింగ్' ఎక్కువగా ఉన్న పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక శ్రద్ధతో పునఃపరిశీలన జరపాలి**

**-5 శాతానికి మించి 'పెర్మనెంట్ షిఫ్టింగ్' ఉన్న బూత్‌లను మళ్లీ వెరిఫై చేయాలి**

**-ఏ ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును కోల్పోకూడదన్నదే మా లక్ష్యం**

**-నమోదు శాతం తక్కువగా ఉన్న బూత్‌ల వివరాలను తహాశీల్దార్ లకు అందజేసిన ఎమ్మెల్యే**

**??ూ×= నమోదు, మ్యాపింగ్ ప్రక్రియాలో ఉన్న లోపాలను, సమస్యలను కమ్మర్‌పల్లి, మోర్తాడ్, బాల్కొండ, మెండోరా మండలాల తహాసీల్దార్లతో కలిసి వివరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

నిజామాబాద్ జులై28:( విజన్ ఆంధ్ర ) : బాల్కొండ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ూ×=) ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించి, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. మంగళవారం కమ్మర్‌పల్లి, మోర్తాడ్, బాల్కొండ, మెండోరా మండల తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించిన ఆయన, సంబంధిత తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సర్ నమోదు ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల నమోదు, మ్యాపింగ్, డిజిటలైజేషన్,సర్ (డెత్, డబుల్, షిఫ్టెడ్) వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా అధికారులు ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిందని



వివరించగా, నమోదైన వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా నో మ్యాపింగ్,డెత్, డబుల్, షిఫ్టెడ్ (ూూణ) కేటగిరీల్లో నమోదైన ప్రతి కేసును పునఃపరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులను కోరారు.

నియోజకవర్గంలో ప్రస్తుతం సగటున 89 శాతం మేర ఓటర్ల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్న ఎమ్మెల్యే, ఈ శాతం కంటే తక్కువగా నమోదు జరిగిన పోలింగ్ బూత్‌ల జాబితాను సంబంధిత తహసీల్దార్లకు అందజేసినట్లు తెలిపారు. ఆయా బూత్‌లలో నమోదు శాతం ఎందుకు తగ్గిందో ప్రత్యేకంగా పరిశీలించి, మిగిలిన అర్హులైన ఓటర్లను గుర్తించి ఆగస్టు 3లోపు ఎన్యూమరేషన్ పత్రాలు అందజేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అదేవిధంగా, 2002 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 'నో మ్యాపింగ్' ఓటర్లు 5 శాతానికి మించి ఉన్న పోలింగ్ బూత్‌లు, అలాగే 'పెర్మినెంట్ షిఫ్టెడ్' ఓటర్లు 5 శాతానికి మించి నమోదైన బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు.ఇంకా సమయం ఉన్నందున సాంకేతిక లోపాలు, సమాచార పొరపాట్లు లేదా ఇతర కారణాల వల్ల నిజమైన ఓటర్లకు అన్యాయం జరగకుండా మరోసారి క్షేత్రస్థాయిలో ధృవీకరణ చేపట్టాలని కోరారు.

మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇంకా నమోదుకాని అర్హులైన ఓటర్లను గుర్తించి, BLAలు, బీూలు, రెవెన్యూ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి వంద శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. "ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా నమోదు కాకుండా మిగలకూడదు. ప్రతి ఓటరి హక్కు పరిరక్షించబడాలి. అదే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం" అని ఆయన అన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, దానిని పరిరక్షించడం బాధ్యత గల ప్రజాప్రతినిధులుగా తమ కర్తవ్యమని వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. సర్ ప్రక్రియ పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ,ఇందులో భాగంగానే నేడు బాల్కొండ, మెండోరా మండలాల తహసీల్దార్లను కూడా స్వయంగా కలిసి ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలు, సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ తరఫున విన్నవించామని,అలాగే నియోజకవర్గం లోని మిగతా అన్ని మండలాల్లో కూడా ఇలాగే అందజేస్తామని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా బీఆర్ఎస్ పార్టీ తరఫున నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# ఆరుతడి వరి పద్ధతి ద్వారా రైతులకు ఎంతో మేలు.

## - ట్రై కంపెనీ డైరెక్టర్ సుమన్



నల్లబెల్లి, జూలై 28(విజన్ ఆంధ్ర): ఆరుతడి వరి పద్ధతి ద్వారా రైతులకు, వాతావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ట్రై కంపెనీ డైరెక్టర్ సుమన్, మిట్టి ల్యాబ్ డైరెక్టర్ అండ్ ఫౌండర్ దేవాదత్తు దాల్, గూగుల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్లా అన్నారు. మండలంలోని కన్నారావుపేట రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన వరిలో ఆరు తడి పద్ధతి పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జూనియర్ ఫీల్డ్ ఆఫీసర్ గ్రహించే పని గురించి వివరించి రైతులను ఆన్ బోర్డ్ చేయడము, పొలముల మ్యాపింగ్, పొలాలలో ఏడబ్ల్యుడి ,(ఆల్టర్నేట్ వెట్ అండ్ డ్రై) పైపు ఉపయోగం గురించి వరి పొలానికి అందించే నీటి పద్ధతిని వివరించారు. వరి పొలానికి ఆరు తడి పద్ధతి ద్వారా నీరును అందిస్తే వరి ఏపుగా పెరిగి వేరు వ్యవస్థ సమృద్ధిగా ఏర్పడడంతో పాటు చీడపీడల నుండి రక్షించడం జరుగుతుందని వివరించారు. అలాగే వరి లో ఎక్కువ నీరు ఉండడం ద్వారా మిథేన్ వాయువు ఏర్పడి వాతావరణ కాలుష్యం ఏర్పరుస్తుందని అన్నారు. ఏ డబ్ల్యుడి పద్ధతి ఉపయోగించడం ద్వారా నీటిని తగ్గించి రాబోయే తరానికి నీటిని అందివ్వడం జరుగుతుందని సూచించారు. ట్రై అండ్ మిట్టి ల్యాబ్ రైతులు వాతావరణాన్ని రక్షిస్తున్నారని కొనియాడారు. రాబోయే రోజుల్లో ట్రై అండ్ మిట్టి ప్రోగ్రాంలో రైతులందరూ చేరాలని తెలిపారు. ఇప్పటివరకు వరంగల్ జిల్లాలోని దాదాపు లక్ష ఎకరాల వరకు ట్రై అండ్ మిట్టి ల్యాబ్ ప్రతినిధులు వరి పొలాలలో పని చేస్తూ రైతులకు ఏ డబ్ల్యూ డి గురించి వివరించి ఆరుతడి పద్ధతిని పాటిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కన్నారావుపేట సర్పంచ్ పల్నాటి మూర్తి, నాగరాజు పల్లి మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవి, ప్రతాపరెడ్డి, డిస్టిక్ మేనేజర్ రాజు, క్లస్టర్ ఇన్చార్జులు, ఫీల్డ్ ఆఫీసర్లు, జూనియర్ ఫీల్డ్ ఆఫీసర్లు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## తాళ్లరాంపురం మాజీ సర్పంచ్ బజ్జరం పావని భర్తను పరామార్శించిన బిజెపి అబ్బగోని అశోక్ గౌడ్

బాల్కొండ, జులై 28 (విజన్ ఆంధ్ర ) : గత కొన్ని రోజుల క్రితం తాళ్లరాంపూర్ తాజా మాజీ సర్పంచ్ బెజ్జారం పావని హఠాత్ మరణం చెందడంతో పావని భర్త భానుని పరామర్శించడం జరిగిందని తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మరియు బిజెపి నాయకులు నాయకులు అబ్బగోని అశోక్ గౌడ్ తెలియజేశారు. అతి చిన్న వయసులోనే సర్పంచ్ గా గెలిచి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నటువంటి పావని భానుని ఎంతో ఎదుగుదల అవకాశాలు ఉండే స్థానంలో ఇలాంటి విషాదకరణం చోటు చేసుకోవడం వల్ల తీవ్ర దిగ్భ్రాంతి గురిచేసిందని అబ్బ గోని అశోక్ గౌడ్ తెలియజేశారు. పావని భర్త భానూ ధైర్యంతో ఉండాలని తమ కుటుంబంకు తమ మద్ధతు ఎప్పుడూ అండగా ఉంటుందని అబ్బగోని అశోక్ గౌడ్ తెలియజేశారు.

# నల్లమల గిరిజనులు, ఆదివాసీలు ,ఎస్సీ ఎస్టీల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూరులో పర్యటించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు, గురుకుల విద్యాసంస్థల సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి వివిధ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.

మంత్రి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, పీవీటీజీ గురుకుల విద్యాసంస్థ, గిరిజన బాలికల గురుకుల పాఠశాల, ఇతర విద్యాసంస్థల తరగతి గదులు, హాస్టళ్లు, వంటశాలలు, భోజనశాలలు, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్లు, వసతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, ఆహార నాణ్యత, ఆరోగ్య సేవలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, క్రీడా సామగ్రి, ఉపాధ్యాయుల బోధన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను చెప్పాలని సూచిస్తూ, ప్రభుత్వం ప్రతి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక సందేశం ఇచ్చిన మంత్రి, నల్లమల అడవులు తెలంగాణకు ప్రకృతి వరమని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా అమ్రాబాద్, పదర మండలాల్లో ఆర్టికల్--273(1) గ్రాంట్, ప్రధానమంత్రి ధర్తి ఆబా జనజాతి గ్రామ ఉత్కర్ష అభియాన్ (పీఎం జుగా--జీ+ఖా) పథకాల కింద రూ.12.70 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. విద్యా సంస్థల్లో అదనపు తరగతి గదులు, డార్మిటరీలు, కిచెన్ కమ్ డైనింగ్ హాల్స్, ప్రహరీ గోడలు, టాయిలెట్ బ్లాకులు, తాగునీటి సదుపాయాలు, స్టోరేజ్ సంపులు, ఇతర మౌలిక వసతుల నిర్మాణం ఈ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు.

అదే విధంగా చెంచు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వాలనే లక్ష్యంతో రూ.1.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. అడవుల్లో సేకరించే తేనె, చింతపండు, ఉసిరి, ఔషధ మొక్కలు, వెదురు ఉత్పత్తులు, హస్తకళా వస్తువులు, ఇతర అటవీ ఉత్పత్తులను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడం ద్వారా మధ్యవర్తుల దోపిడీని అరికట్టి గిరిజన కుటుంబాలకు అధిక ఆదాయం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ...., మహేంద్రనాథ్ గారు తన జీవితమంతా దళితులు, గిరిజనులు, పేద ప్రజల అభ్యున్నతి కోసం అంకితం చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను ప్రజా ప్రభుత్వం స్వీకరించిందని తెలిపారు. గురుకులాల్లో ఉపాధ్యాయుల కొరతపై స్పందించిన మంత్రి, విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన చోట వెంటనే బోధన సిబ్బందిని నియమిస్తామని ప్రకటించారు. సబ్జెక్టుల వారీగా ఖాళీలను గుర్తించి త్వరితగతిన భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. బోధన సిబ్బంది సేవల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేసి వచ్చే జూన్ నాటికి పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

పదేళ్లకు పైగా సేవలందిస్తున్న నాన్-టీచింగ్ సిబ్బంది, వంట కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో సస్పెండ్ అయిన వారి కేసులను శాఖాపరంగా సమీక్షించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు కూడా ప్రభుత్వానికి సమానంగా ముఖ్యమని అన్నారు.

ఈ పర్యటనలో మన్ననూరులోని పీవీటీజీ గురుకుల జూనియర్ కళాశాలకు అదనపు తరగతి గదులు, కిచెన్ కమ్ డైనింగ్ హాల్, టాయిలెట్ బ్లాక్, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు ప్రహరీ గోడ, కిచెన్ కమ్ డైనింగ్ హాల్, ఉడిమిల్ల బాలికల ఆశ్రమ పాఠశాలకు డార్మిటరీ, అదనపు తరగతి గదులు, స్టోరేజ్ సంప్, అచ్చంపేట, ఇనోల్, బాణాల, చెంచుగూడెం గిరిజన విద్యాసంస్థలకు ప్రహరీ గోడల నిర్మాణంతో పాటు పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

మంత్రి పర్యటన సందర్భంగా అధికారులు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు అందించగా, పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి కార్యక్రమం పారదర్శకంగా అమలు కావాలని, నల్లమల ప్రాంత అభివృద్ధిలో అధికారులు ప్రత్యేక బాధ్యతతో పనిచేయాలని మంత్రి సూచించారు.

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ...., అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి మన నల్లమల్ల ముద్దుబిడ్డ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా నల్లమల ప్రాంతంలోని చెంచు గిరిజనులు, దళితులు, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న నల్లమల గ్రామాలకు ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతులు వేగంగా చేరుతున్నాయని తెలిపారు.

రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వయంగా నల్లమల ప్రాంతంలో పర్యటించి గురుకుల విద్యాసంస్థలను సందర్శించడం, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, నాణ్యమైన ఆహారం, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

అమ్రాబాద్, పదర మండలాల్లో రూ.12.70 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు ఈ ప్రాంత రూపురేఖలను మార్చివేస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో కొత్త భవనాలు, అదనపు తరగతి గదులు, డార్మిటరీలు, కిచెన్ కమ్ డైనింగ్ హాల్స్, ప్రహరీ గోడలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు.

చెంచు గిరిజనుల కోసం రూ.1.80 కోట్లతో నిర్మించనున్న ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని తెలిపారు. గిరిజనులు అడవుల నుంచి సేకరించే తేనె, చింతపండు, ఉసిరి, ఔషధ మొక్కలు, వివిధ ఉత్పత్తులు తదితర వస్తువులను నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పించడం ద్వారా మధ్యవర్తుల దోపిడీ తగ్గి, గిరిజన కుటుంబాలకు మెరుగైన ఆదాయం లభిస్తుందని ఎమ్మెల్యే మంత్రికి వివరించారు.

అచ్చంపేట నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, సాగునీరు, గిరిజన సంక్షేమం వంటి అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.

నల్లమల ప్రాంత ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని, ప్రతి గిరిజన తండా, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందే వరకు తమ కృషి కొనసాగుతుందని డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు.

రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో అచ్చంపేట నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.

అనంతరం మద్దిమడుగు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించే తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, డిఇఓ రమేష్ కుమార్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి ,ఆయా శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## వట్ పల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

**- అధ్యక్షులుగా సిద్దేశ్వర్ గౌడ్**

సంగారెడ్డి /వట్ పల్లి: వట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్.ఎస్ ఫక్షన్ హాల్ నందు వట్‌పల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించారు.వట్ పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా సిద్దేశ్వర్ గౌడ్,ప్రధాన కార్యదర్శిగా కచ్చు రావు,ట్రెజరర్ గా పల్లె వెంకట్ రావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షులు సిద్దేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ 2026- 2027 సంవత్సరానికి వట్ పల్లి మండల లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా తనపై నమ్మకం ఉంచిన లయన్స్ క్లబ్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ ద్వారా మంచి సేవా కార్యక్రమాలు నిరహిస్తామని వెల్లడించారు. ప్రజలతో మమేకమై లయన్స్ క్లబ్ కి మంచి పేరు తెస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ పీఆర్వో లయన్ అనంత్ రెడ్డి, రీజియన్ చైర్మన్ రాజ్‌కుమార్, జోన్ చైర్మన్ వెంకట్ రావు, రీజియన్ కార్యదర్శి చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ కేబినెట్ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, డీసీ సభ్యులు పెద్దన్న, క్లబ్ మాజీ అధ్యక్షులు మొయినొద్దీన్,కిషన్ రావు,క్లబ్ సభ్యులు మహేందర్, గోపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మల్లయ్య, వైద్యసాగర్, దిగంబర్ రావు, అఖిల్ పాషా, శేఖర్, మధు, మొహ్సిన్, శ్రీనివాస్ గౌడ్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగూర్ నుంచి మంజీరాకు నీటి విడుదల



చౌటకూర్ జూలై 28 (విజన్ ఆంధ్ర ):- పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు నుంచి మంగళవారం త్రాగునీటి అవసరాల నిమిత్తం మంజీరా డ్యామ్ కు నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలియజేశారు. మంజీరా ప్రాజెక్టులోకి త్రాగునీటి అవసరానికై ఈ నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. హైదరాబాద్ సంగారెడ్డి ప్రాంతాల్లో తగునీరు సమస్య రాకుండా ఈ నీటిని వదులుతున్నామన్నారు. ప్రాజెక్టులో నుంచి 0.1 టీఎంసీ నీటిని 10 నంబర్ గేటు ద్వారా వదులుతున్నామన్నారు. మంజీరా నది పరివాక ప్రాంతంలోని ప్రజలు పశువుల కాపరులు జాలర్లు అప్రమంతగా ఉ ండాలని అధికారులు సూచించారు.

## "వైద్య సేవలను వినియోగించుకోవాలి"

**- చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్**

మందమర్రి, జూలై 28 (విజన్ ఆంధ్ర) : సింగరేణి ఏరియా ఆసుపత్రులలో అందిస్తున్న వైద్య సేవలను కార్మిక,కార్మిక కుటుంబ సభ్యులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిని సీఎంఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ విభాగాలు,క్యాజువాలిటీ వార్డు లతో పాటు ఇతర వైద్య సేవల విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆస్పత్రి వైద్యులు,నర్సింగ్ సిబ్బంది,పారా మెడికల్ సమిష్టి కృషితో నాణ్యమైన,మెరుగైన వైద్య సేవలను కార్మికులకు,కుటుంబ సభ్యులకు అందించాలని పేర్కొన్నారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ వెంట ఆసుపత్రి సూపరిండెంటెంట్ మధు కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మదార్ సాహెబ్,వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తపై దాడి కలకలం

**- కాంగ్రెస్ నాయకులే దాడికి పాల్పడ్డారంటూ ఆరోపణలు**

**- నిందితులను అరెస్టు చేయాలని బీఆర్ఎస్ నిరసన**



జహీరాబాద్ జూలై 28 (విజన్ ఆంధ్ర) : ఝరాసంగం గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తపై దాడి జరిగిందంటూ ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. సోమవారం రాత్రి సుమారు పది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తనను దారికాచి ఆయుధాలతో దాడి చేశారని బాధితుడు తెలిపినట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానిక దవాఖానకు తరలించారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నిరసన : దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఝరాసంగం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బొగ్గుల సంగమేశ్వర్, మండల అధ్యక్షుడు వెంకటేశం, మాజీ సర్పంచ్ జగదీశ్వర్, నూతన సర్పంచ్ వినోద్ బాలరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. రెండు నెలల క్రితం గ్రామంలో జరిగిన గొడవకు కారణమైన వారిపై సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లే తాజా ఘటనకు దారితీసిందని వారు ఆరోపించారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, దాడికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రత్యేక శిక్షణలో ఇల్లందు పురపాలక ప్రజా ప్రతినిధులు..

**- పౌర సేవలను మరింత వేగం చేయడమే లక్ష్యం..**

ఇల్లందు, జూలై 29 (విజన్ ఆంధ్ర) ఇల్లందు:పట్టణాల సమగ్ర రూపాంతరమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వశీ సి.డి.ఎం.ఎ సంయుక్తంగా చేపట్టిన పురపాలక ప్రజాప్రతినిధుల ప్రత్యేక శిక్షణా తరగతులు గచ్చిబౌలిలోని ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఉన్నత స్థాయి శిక్షణా కార్యక్రమానికి ఇల్లందు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ సహా కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు,మున్సిపల్ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.పౌర సేవలను మరింత వేగవంతం చేయడం, పట్టణాల్లో ఆధునిక మౌలిక వసతుల కల్పనను మెరుగుపరచడమే లక్ష్యంగా 'ఎస్సీఐ' ఆడిటోరియంలో నిపుణులు ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల్లో తడి-పొడి చెత్త నిర్వహణ, ప్రతి ఇంటి నుండి క్రమం తప్పకుండా చెత్త సేకరణ , పారిశుధ్య పనుల పర్యవేక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించారు. డి.ఆర్.సి.సి కేంద్రాల్లో చెత్తను శాస్త్రీయంగా వినియోగించి నాణ్యమైన ఎరువులను ఎలా తయారు చేయాలో వివరించారు. అలాగే పట్టణ ప్రణాళిక, ఆధునిక రహదారులు, కాలువల అభివృద్ధి, మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ లేకుండా చేసే ఇంజనీరింగ్ మెళకువలను ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. మున్సిపల్ స్వయం సమృద్ధిని పెంచే దిశగా వార్డుల వారీగా ఇంటి పన్ను, నీటి పన్ను, వ్యాపార పన్నుల సేకరణను ముమ్మరం చేసే వ్యూహాలపై చర్చించారు.




గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా వేదికగా నేర్చుకున్న ఆధునిక పాలన పద్ధతులను నూతన టెక్నాలజీని ఇల్లందు పురపాలక సంఘం పరిధిలో అమలు చేసి పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఇల్లందు పాలకవర్గం తెలియజేసింది.ఈ ప్రతిష్ఠాత్మక శిక్షణా కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర దానియల్, వైస్ చైర్మన్ పెండ్యాల రాజు , మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రావు, వార్డు కౌన్సిలర్లు సైదుమియ, చిల్లా భారతి, రాధా కోరి, గోపగాని రాజు, రేఖ స్వరూప, గండే పద్మ, మెరుగు కార్తీక్, మొగిలి లక్ష్మి, రంప రమ్య, నిరుడు ఉపేంద్ర, సోని బాయి కోరి, ఉ ల్లింగా విజయలక్ష్మి, ఎం.డి.జాఫర్, నీలపు రమేష్, కొర్లపాటి శివ కిరణ్, కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పల్రే స్వర్ణలత తదితరులు శిక్షణ పొందారు

## సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు ముందే హెచ్చరిక ఇచ్చారా..?

**- సైరన్ మోగించారా..?**

**- అధికారులపై ప్రజల ప్రశ్నలు**

చౌటకూర్, జూలై 28 (విజన్ ఆంధ్ర): పుల్కల్ మండలం పరిధిలోని సింగూర్ ప్రాజెక్టు నుంచి మంజీరా బ్యారేజ్‌కు తాగునీటి అవసరాల కోసం మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటలకు 10వ గేటును 2.50 మీటర్ల ఎత్తులో ఎత్తి నీటిని విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. మొత్తం 0.1 టీఎంసీ నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అయితే, నీటి విడుదలకు ముందు దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే చర్యలు తీసుకున్నారా? సైరన్ మోగించారా? గ్రామాలకు ముందస్తు సమాచారం అందించారా? అనే ప్రశ్నలు స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసే సమయంలో ప్రజల భద్రత అత్యంత ప్రాధాన్యమైన అంశం కావడంతో, ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం, సైరన్ మోగించడం, గ్రామపంచాయతీలు, పోలీసు శాఖ ద్వారా సమాచారం చేరవేయడం వంటి చర్యలు తీసుకోవడం సాధారణ విధానంగా భావిస్తారు.ఒకవేళ అలాంటి హెచ్చరికలు ఇవ్వకుండా నీటిని విడుదల చేసి ఉంటే, అది ప్రజల భద్రతను ప్రమాదంలోకి నెట్టే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నది పరివాహక ప్రాంతాల్లో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు, ఇతరులు ముందస్తు సమాచారం లేకపోతే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.ఈ ఘటనలో సైరన్ మోగించారా లేదా? ముందస్తు హెచ్చరికలు జారీ చేశారా లేదా? అనే అంశాలపై నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రత విషయంలో నిర్లక్ష్యం సహించబోమని, సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రతి నీటి విడుదలకు ముందు తప్పనిసరిగా సైరన్ మోగించి, దిగువ ప్రాంతాల ప్రజలకు ముందస్తు సమాచారం అందించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని వారు కోరుతున్నారు.

## హన్మయ్య నాయక్ తండాలో మద్య నిషేధానికి

# గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం

**- మద్యరహిత తండా నిర్మాణానికి గ్రామస్తుల సంకల్పం**

చౌటకూర్, జూలై 28: పుల్కల్ మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని హన్మయ్య నాయక్ తండాలో మద్య నిషేధానికి గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్ కవిత సేనాపతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామంలోని ప్రజలు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని మద్యం వల్ల కుటుంబాలు, యువత, సమాజంపై పడుతున్న ప్రతికూల ప్రభావాలపై విస్తృతంగా చర్చించారు.

చర్చ అనంతరం తండాలో మద్యం అమ్మకాలు, వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామాన్ని మద్యరహిత తండాగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం సహకరించాలని, మద్యం నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని గ్రామసభలో పిలుపునిచ్చారు. గ్రామస్తులు ఆమోదించిన మద్య నిషేధ తీర్మానాన్ని సర్పంచ్ కవిత సేనాపతికి అధికారికంగా అందజేశారు. ఈ నిర్ణయాన్ని గ్రామ ప్రజలందరూ అమలు చేయాలని, యువత మంచి భవిష్యత్తు కోసం మద్యానికి దూరంగా ఉండాలని గ్రామ పెద్దలు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత సేనాపతి, ఉపసర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్ అంతిరెడ్డి...

బోధన్, జులై 28(విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠకులతో, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో విద్యార్థులు కొన్ని పుస్తకాలు కావాలని కోరడంతో రెండు రోజులలో పుస్తకాలను సమకూరుస్తానని చైర్మన్ హామీనిచ్చారు. త్వరలో గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తలారీ నవీన్ తదితరులు ఉన్నారు.

# జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- ఎంపిడిఓ రమేష్**

బోధ్. జూలై 28. (విజన్ ఆంధ్ర): తెలంగాణలో ఎల్ నినో నేపథ్యంలో వీబీజీ రాం జీ పథకంలో నీటి సంరక్షణ కోసం చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ రమేష్ అధికారులకు సూచించారు. జల సిరి కార్యక్రమ అమలుపై మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో టిఏలు, ఐకెపి సిసిలకు కార్యక్రమ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల వారిగా ఫారంపాండులు, ఇంకుడు గుంతలు, బోర్వెల్ రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టుటకు మహిళా సంఘాలకు మరియు రైతులకు అవగాహన కల్పించి ప్రతి ఇంటికి ఇంకుడుగుంత, ప్రతి చేనుకు ఫారంపాండు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని సూచించడం జరిగింది. ఇట్టి లక్ష్యాలను ఆగస్టు 15లోగా చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపిఎం గణేష్, ఈసి మధుకర్, టిఏలు, సీసీలు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం

అక్కన్నపేట, జూలై 28 (విజన్ ఆంధ్ర) : ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించారు. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2బీహెచ్‌కే గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.

ప్రజావాణికి ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# తాటిగూడలో బాల గ్రామ సభ

బెల్లంపల్లి జూలై 28 విజన్ ఆంధ్ర : కాసిపేట మండలంలోని తాటిగూడ గ్రామ పంచాయతీలో దిశా మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం బాల గ్రామ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మడావి వెంకటేష్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు, వారి హక్కుల పరిరక్షణే గ్రామ అభివృద్ధి లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో బాలల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి చిన్నారికి సమాన అవకాశాలు, రక్షణ కల్పించడం అందరి బాధ్యత అని అన్నారు.

గ్రామంలోని ప్రతి చిన్నారి పాఠశాలకు వెళ్లేలా చూడాలని, బడి మానేసిన పిల్లలను తిరిగి విద్యలోకి తీసుకురావాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ చట్టవిరుద్ధమని, ఎక్కడైనా అలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే పంచాయతీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం, మెరుగైన ఆరోగ్య సేవలు



అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్ బొద్దుల రూప, ఉపాధ్యాయురాలు మంగ రమాదేవి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

లక్సెట్టిపేట జూలై,28 (విజన్ ఆంధ్ర ) విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సాయి కిరణ్ కాసమల్ల అన్నారు. మంగళవారం పట్టణంలోని గుడ్ షెఫర్డ్ హైస్కూల్ లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత స్థాయికి ఎదగడానికి సోపానమని అన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు ర్యాంకుల గురించి పై తరగతికి వెళ్లేందుకే కాకుండా జీవితంలో, సమాజంలో ఎలా బతకాలో తెలుసుకోవ దానికి విద్య ఉపయోగపడాలన్నారు. స్పష్టమైన గమ్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థులు పుస్తకాల పరిజ్ఞానం పైనే కాకుండా, నైతిక విలువలు, మర్యాద, క్రమశిక్షణ అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజిపి సంతోష్, వైస్ ప్రెసిడెంట్ జి




పద్మ, జనరల్ సెక్రటరీ వేల్పుల సత్యం, న్యాయవాదులు అక్కల శ్రీధర్, గడి కొప్పుల కిరణ్ కుమార్, నగరు రవీందర్, మౌనిక ,పాఠశాల కరస్పాండెంట్ వై శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సెబాస్టిన్, విద్యార్థులు పాఠశాల సిబ్బంది, కోర్టు సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు న్యాయం అందించే తొలి కేంద్రం పోలీస్ స్టేషన్"

**- దేవరకద్ర పోలీస్ స్టేషన్ తనిఖీలో ఎస్పీ డి.జానకి...**

**- సత్వర సేవలకు ఆదేశం...**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 28, (విజన్ ఆంధ్ర)

"పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తికి న్యాయం జరగాలి. ఫిర్యాదులను బాధ్యతగా స్వీకరించి చట్టబద్ధంగా పరిష్కరించాలి" అని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ స్పష్టం చేశారు.

వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం దేవరకద్ర పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు, బీట్ వ్యవస్థ, వారెంట్ల అమలు తీరును క్షుణ్ణంగా పరిశీలించారు.

నేరాల నియంత్రణతో పాటు నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పెండింగ్ కేసులు, గ్రేవ్ కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంచి ముందస్తుగా నేరాలను అరికట్టాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారుల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, కమ్యూనిటీ పోలీసింగ్ బలోపేతం చేయాలని ఆదేశించారు.

సిబ్బందితో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. స్టేషన్ పరిశుభ్రత, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ, సిబ్బంది క్రమశిక్షణపై కూడా ఎస్పీ గారు దృష్టి సారించారు. సిబ్బంది సంక్షేమానికి పోలీసు శాఖ కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

స్టేషన్‌పై పూర్తి పట్టు సాధించి సిబ్బందితో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్ఐ భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## మైసంపల్లి లో బాల వికాస మంచినీటి శుద్ధి కేంద్రం పున : ప్రారంభం

### - సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి

నంగునూరు, జులై 28 విజన్ ఆంధ్ర : నంగునూరు మండలం మైసంపల్లి గ్రామంలో బాల వికాస మంచినీటి శుద్ధి కేంద్రాన్ని మంగళవారం పునః ప్రారంభించారు. అయిదు సంవత్సరాల నుంచి మూతపడిన మంచినీటి శుద్ధి ప్లాంట్ విషయాన్ని గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి నరేశ్ రెడ్డి, మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హరీశ్ రావు బాల వికాస సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. మంచినీటి శుద్ధి కేంద్రానికి మరమ్మతులు చేసి గ్రామ ప్రజల భాగస్వామ్యంతో మంగళవారం పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోమిరెడ్డి నరేశ్ రెడ్డి మాట్లాడుతూ మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించడంతో గ్రామ ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లి మంచి నీళ్లు తెచ్చుకునే ఇబ్బందులు తొలగిపోయాయని తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావుకు, బాల వికాస సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్ రావు స్ఫూర్తితో మంచినీటి శుద్ధి కేంద్రంలో సభ్యత్వం పొందిన వారికి స్వంత ఖర్చులతో ఉచితంగా మంచినీటి క్యాన్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల వికాస మంచినీటి శుద్ధి కేంద్రం కార్యక్రమ అధికారి మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు ,బాల వికాస ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలతో రైతులు ఆర్థిక లాభాలు పొందాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి జూలై 28 విజన్ ఆంధ్ర : రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు కష్టతరంగా మారిన నేపథ్యంలో రైతులు తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆర్థికంగా లాభపడాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రాయితీ విత్తనాలు, ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుని రాయితీ విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులు పొందాలని రైతులకు సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వంటశాలలో పరిశుభ్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్య బలోపేతమే విద్యాభివృద్ధికి పునాది

**- 1, 2వ తరగతుల విద్యార్థులకు చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్పాలి**

**-కె.హైమావతి, జిల్లా కలెక్టర్**

**- పాలమాకుల జెడ్పీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ**

**- మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆగ్రహం**

నంగునూరు,జులై 28 విజన్ ఆంధ్ర : ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు చదవడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలు పటిష్టంగా అందిస్తే విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన అన్నం, వంకాయ, ఆలుగడ్డ, టమాట కూర, సాంబార్ తదితర వంటకాలను పరిశీలించారు. వాటి నాణ్యత, పరిమాణాలపై ఆరా తీశారు. పాఠశాలకు హాజరైన 108 మంది విద్యార్థులకు తయారు చేసిన కూర సరిపోతుందా అని ప్రశ్నించారు.

సాంబారులో సొరకాయ, మునగ ముక్కలు కేవలం మొక్కుబడిగా వేసినట్లు కనిపిస్తున్నాయని అడిగారు. విద్యార్థుల సంఖ్యకు తగినంత పరిమాణంలో కూరగాయలు వినియోగించ లేదని గుర్తించారు. వంట సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో నిర్లక్ష్యానికి తావు లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూను ప్రతిరోజూ తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ప్రతి వంటకం విద్యార్థులందరికీ సరిపోయే విధంగా, రుచికరంగా, పోషక విలువలతో తయారు చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న ఎస్జీటీ ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను సందర్శించి, ఉపాధ్యాయులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ముఖ్యంగా 1వ, 2వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించాలని సూచించారు. ఆ తరగతుల విద్యార్థులకు చదవడం, రాయడం ఎట్టి పరిస్థితుల్లోనూ నేర్పించాలని, విద్యా పునాదులు బలంగా ఉండేలా కృషి చేయాలని ఆదేశించారు.

3వ, 4వ తరగతుల విద్యార్థులకు బోధించే ప్రతి సబ్జెక్టును కార్యాచరణ ఆధారిత పద్ధతుల్లో(యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్) బోధించాలని సూచించారు. పిల్లలు ఆసక్తిగా, ఆనందంగా నేర్చుకునే వాతావరణాన్ని తరగతి గదుల్లో సృష్టించాలని తెలిపారు. కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందే విధంగా బోధనా పద్ధతులు ఉండాలని పేర్కొన్నారు. ప్రాథమిక విద్య బలోపేతం అయితేనే ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ అన్నారు. చిన్న వయస్సులోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తే, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు మరింత ఆసక్తి చూపుతారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలలలో విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన నాణ్యత, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# సర్ నమోదుపై తహశీల్దార్ సమీక్షా సమావేశం

### - నందిగామ మండల పలు పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహణ.

నందిగామ:జులై 28 (విజన్ ఆంధ్ర న్యూస్) ; నందిగామ మండలంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్(సర్=) ప్రక్రియలో మరింత పురోగతి సాధించడమే లక్ష్యంగా నందిగామ మండల తహశీల్దార్ సైదులు అధ్యక్షతన నందిగామ మండల పలు పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో సర్ (సర్=) ప్రక్రియ బాగా జరిగినప్పటికీ,ఇంకా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు ఈ ప్రక్రియలో భాగంగా మొత్తం 27,362 ఓటర్లకు గాను 25,910 ఓటర్లు డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని, ఇంకా 1,760 ఓటర్లు డిజిటలైజేషన్ నమోదు చేసుకోవాలివుంది,కావున ఇంకా నమోదు చేసుకోకుండా మిగిలిపోయిన వారు ఉంటే వెంటనే డిజిటలైజేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

# యువత భవిష్యత్తును దోచుకుంటున్న పాలకులపై ఉద్యమిద్దాం

**హుస్నాబాద్ లో ఏఐవైఎఫ్ హుస్నాబాద్ అక్కన్నపేట మండలాల మహా సభ**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 28 : యువత భవిష్యత్తును దోచుకుంటున్న పాలకులపై ఉద్యమించాలని,బీజేపీ నిరంకుశ విధానాలు దేశానికి ప్రమాదకరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మాజీ రాష్ట్ర నాయకులు సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ అన్నారు. ఏఐవైఎఫ్ అఖిల భారత యువజన సమాఖ్య హుస్నాబాద్ అక్కన్నపేట మండలాల మహాసభ హుస్నాబాద్ పట్టణం లోని స్థానిక సిపిఐ కార్యాలయం అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్ లో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు బిచ్చాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ యువత నేడు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు, నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం, కాంట్రాక్టు--ఔట్‌సోర్సింగ్ విధానాలు, పరిశ్రమల కొరత, నైపుణ్యాభివృద్ధి అవకాశాల లేకపోవడం, రైతు కుటుంబాల యువత ఇబ్బంది పడుతున్నారన్నారు.ప్రభుత్వ విద్య,వైద్య రంగాల నిర్లక్ష్యం, వంటి సమస్యలు యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టుతున్నాయన్నారు . ప్రజల పన్నులతో నడవాల్సిన ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ ప్రయోజనాల కోసం యువత జీవితాలతో చెలగాటమాడుతున్న పాలకులపై యువజనులుగా




పోరాటం చేయాలన్నారు.అభివృద్ధి అంటే కేవలం ప్రకటనలు కాదని, శాశ్వత ఉద్యోగాల కల్పనతోనే సాధ్యమని స్పష్టం చేశారు .దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యార్థులకు న్యాయం, విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం ఢిల్లీలో కొనసాగిన విద్యార్థి--యువజన ఉద్యమాలు దేశ యువత ఆవేదనకు ప్రతీకగా కేంద్రం మెడలు వంచిన వారి పోరాటం చరిత్రలో నిలుస్తుందన్నారు.ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్, ఏఐవై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు మేడవేణి చిరంజీవి, జాగిరి సాయి కృష్ణ, భూక్యా గణేష్,దొంతరబోయిన రజిత,ఎండీ అన్వర్, అభిలాష్, మహేందర్, చరణ్,, మోరే సాత్విక్, రాజేష్, అంతడుపుల సాకేత్, అభిరామ్ లతో పాటు ఇరు మండలాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.